ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శుక్రవారం 18 అక్టోబరు 2024 | 5





వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

పాతవన్నీ.. కూల్చాల్సిందే



శిథిలస్థితిలో ఉన్న కాకినాడ జీజీహెచ్ అడ్మినిస్ట్రేషన్ భవనం

- కాకినాడ జీజీహెచ్‌లో ప్రమాదకర భవనాలన్నీ తొలగించాల్సిందే
- జేఎన్‌టీయూకే ఇంజనీర్ల బృందం నివేదిక: చిన్నపాటి వర్షానికే శ్లాబ్‌లకు లీకులు
- అత్యంత ప్రమాదకరంగా మారిన సర్జికల్, మెడికల్, ఆర్థోపెడిక్ భవనాల బ్లాకులు
- వీటి స్థానంలో కొత్త బ్లాకుల నిర్మాణాలకు రూ.500కోట్లు అవసరమని అంచనా
- ఈ మేరకు నిధులు కావాలంటూ ప్రభుత్వానికి కలెక్టర్ షాన్‌మోహన్ నివేదిక
- ఎప్పుడు కూలుతాయో తెలియని భవనాల మధ్య బిక్కుబిక్కుమంటూ వైద్యులు సేవలు
- గత వైసీపీ సర్కారు హయాంలో కొత్త భవనాలకు కేంద్రం నిధులిచ్చినా దారి మళ్లింపు

కాకినాడ జీజీహెచ్ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో పేదలకు పెద్దదిక్కు. ఏ పెద్ద అనారోగ్యం వచ్చినా వారంతా వచ్చేది ఇక్కడికే. వందలాది మంది ఇన్‌పేషెంట్లు, ఔట్ పేషెంట్లతో ఈ ప్రభుత్వాసుపత్రి రద్దీగా ఉంటుంది. ఇంతటి కీలకమైన సర్కారు దవాఖాలో భవనాలన్నీ పాతబడిపోయాయి. అసలు ఎప్పుడు కూలిపోతాయో కూడా తెలియని పరిస్థితులు నెలకొన్నాయి.

కాకినాడ(ఆంధ్రజ్యోతి)/కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జీజీహెచ్‌లో వర్షాలకు అనేక భవనాల్లో శ్లాబుల నుంచీ నీరు లీకవు తూనే ఉంటుంది. దీంతో అటు వైద్యులు,ఇటు రోగులు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో పాడుబడ్డ ఈ భవనాలన్నీ అసలేమాత్రం సురక్షితం కాదని ఇటీవల కాకినాడ జేఎన్టీయూ నిపుణుల బృందం నిగ్గు తేల్చింది. వీటన్నింటి నిలగించాలని సిఫార్సు చేసింది. దీంతో వీటిస్థానంలో కొత్తవి నిర్మించడానికి రూ.500కోట్లు అవసరమవుతాయని అధికారులు లెక్క తేల్చారు. ఈ మేరకు నిధులు విడుదల చేయాలంటూ కలెక్టర్ షాన్‌మోహన్ ప్రభుత్వానికి నివేదిక పంపారు.

బిక్కుబిక్కుమనాల్సిందే..

కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అనేక ప్రధాన భవనాలు శిథిలస్థితికి చేరుకున్నాయి. ఇవి ఎప్పుడు కూలిపోతాయో అన్నట్లు బలహీనంగా మారాయి. అసలే వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న నేపథ్యంలో అనేక విభాగాల్లో గోడల దగ్గరనుంచి శ్లాబ్‌ల వరకు వర్షపునీరు లీకవుతోంది. జీజీహెచ్ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో పేదలకు పెద్దదిక్కు. ప్రధానంగా సోమవారం ఓపీ విభాగాలు కిక్కిరిసిపోతాయి. జీజీహెచ్‌కు రోజూ అవుట్ పేషెంట్ విభాగానికి 2వేల మంది వరకు రోగులు వస్తారు. ఇన్‌పేషెంట్ విభాగంలో 1,600 నుంచి 1,800 వరకు రోగులు ఉంటారు. జీజీహెచ్‌కు అనుబంధంగా రంగరాయ మెడికల్ కాలేజీకి సంబంధించి వందలాదిమంది వైద్యులు, పీజీలు, నర్సులు జీజీహెచ్‌లో విధుల్లో ఉంటారు. కార్డియాలజీ, ఆర్థోపెడిక్, గైనకాలజీ, పిడియాట్రిక్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, యూరాలజీ వంటి ఎన్నో విభాగాల్లో రోగులకు కావాల్సిన సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, ఎక్స్‌రేలు అందుబాటులోఉంటాయి. ఐసీయూలతోపాటు యాక్టివ్ మెడికల్ కేర్ యూనిట్లు, ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్లు నిరంతరం పనిచేస్తాయి. దీంతో అత్యుత్తమ వైద్య సదుపాయాలు ఉండడంతో నిత్యం వేలాది మంది జీజీహెచ్‌కు పోటెత్తుతారు. ఆస్పత్రిలో అనేక భవనాలు 50నుంచి 60ఏళ్ల దాటిపోయాయి. దీంతో శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపోతాయో అన్నట్లు మారాయి. ఈ నేపథ్యంలో ఇటీవల కాకినాడ జేఎన్టీయూ ఇంజనీర్లు ఈ భవనాలన్నింటినీ పరిశీలించారు. వీటిలో అనేక భవనాలు బలహీనంగాఉన్నట్లు గుర్తించారు. పైకప్పు నుంచి గోడల వరకు బలహీనంగా మారాయని తేల్చారు. వీటిని తొలగించి కొత్తవి నిర్మించాల్సిందేనని ఇంజనీర్ల బృందం కలెక్టర్ షాన్‌మోహన్‌కు నివేదిక అందించింది.

50ఏళ్లుపైనే...

జీజీహెచ్‌లో అనేక బ్లాకులు చాలా పురాతనమైనవి. ఇవన్నీ ఎప్పుడు కూలిపోతాయో అన్నట్లు మారాయి. అడ్మినిస్ట్రేషన్ భవనంలో రెండో అంతస్తులో ఎంఆర్‌డీ సెక్షన్‌లో ఉన్న మెడికల్ రికార్డులన్నీ పాడవుతున్నాయి. శ్లాబ్‌లనుంచి వర్షం నీరు లీకవడంవల్ల రికార్డులు భద్రపర్చడం కష్టసాధ్యం అవుతోంది. పైగా శ్లాబుపెచ్చులు ఊడిపోవడంతో కొన్ని ప్రత్యేక వార్డులను పూర్తిగా మూసివేశారు. ఇదే భవనంలో ఈఎన్‌టీ, డెంటల్ విభాగాలు, ఓపీ జరిగే విభాగాల్లో షెడ్లు వర్షాలకు పడిపోయాయి. సర్జికల్‌వార్డు, ఆర్థోపెడిక్, అడ్మినిస్ట్రేషన్ భవనం, మెడికల్ వార్డు భవనాలు శిథిలస్థితికి చేరుకున్నాయి. చిన్నపాటి వర్షానికే శ్లాబుల నుంచి నీరులీకై ప్రమాదకరంగా పెచ్చులు ఊడిపడుతున్నాయి. గతంలో ఈ భవనాల్లో పైకప్పు పెచ్చులు రోగులపై పడ్డ సంఘటనలు కూడా ఉన్నాయి. జీప్లస్3 విధానంలో ఉన్న ఈ భవనాలన్నీ కూల్చాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ బ్లాకులు నిర్మించి 50 ఏళ్లు దాటిపోవడంతో ప్రమాదకరంగా మారాయి. ఈ పాత భవనాలను తొలగించి కొత్త భవనాలను నిర్మించాలని ఎప్పటినుంచో ప్రతిపాదనలు మూలుగుతున్నాయి. గత వైసీపీ సర్కారు కేంద్రం నుంచి వచ్చిన నిధులను సైతం దారి మళ్లించేసింది. పలుసార్లు వైద్యఆరోగ్యశాఖ మంత్రి పర్యటనల్లో పాత భవనాల నిర్మాణాలకు నిధులు ఇస్తున్నట్లు చెప్పినా కనీసం చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు.

కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలు

ప్రతిష్టాత్మకమైన జీజీహెచ్‌కు తిరిగి పూర్వవైభవం కూటమి ప్రభుత్వంలో వచ్చేలా అడుగులు పడుతున్నాయి. పాడైన భవనాలను తొలగించి వాటి స్థానంలో జీప్లస్8 విధానంలో ఆధునిక సౌకర్యాలతో కొత్త భవనాలు నిర్మించాలని ఇంజనీర్లు ఇచ్చిన నివేదిక ఆధారంగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కొత్త బ్లాకులు, ఆపరేషన్ థియేటర్‌లు, షెడ్‌ల నిర్మాణాలకు అంచనాలు రూపొందించారు. ఇందుకు రూ.500 కోట్ల వరకు ఖర్చు అవుతుందని తేల్చారు. ఈమేరకు నిధులు విడుదల చేయాలని కోరుతూ కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఇదేవిషయమై కలెక్టర్ మాట్లాడుతూ జీజీహెచ్‌లో పాత భవనాలు తొలగించి వాటి స్థానంలో కొత్త భవనాల నిర్మాణాలకు రూ.500కోట్లు కావాలని ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. ప్రస్తుతానికి పాత భవనాల్లోనే రోగులకు సేవలు అందిస్తున్నామని, నిధులు రాగానే కొత్త భవనంలో 600 పడకలు ఉండేలా ప్రణాళికలు రూపకల్పన చేశామన్నారు.

రామాయణ గ్రంథాన్ని రచించిన మహోన్నత వ్యక్తి వాల్మీకి

- కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): భారత ఇతిహాసా లకు సంబంధించి ఆది కావ్యంగా చెప్పుకునే రామాయణ గ్రంథాన్ని ఈ సమాజానికి అందించిన మహోన్నత వ్యక్తి మహర్షి వాల్మీకి అని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. ఆదికవి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని గురువారం కలెక్ట రేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ వాల్మీకి చిరకాలం తపస్సు ఫలితంగా స్వయం మహర్షి అయ్యారన్నారు. రామాయణం వంటి మహాకావ్యాన్ని ఈ సమా జానికి పరిచయం చేసిన మహోన్నత వ్యక్తి ఆదికవి వాల్మీకి అన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి లల్లి, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, కాకినాడ, పెద్దాపురం అసిస్టెంట్ బీసీ సంక్షేమ అధికారులు సుబ్బారావు, రాజేశ్వరి, బీసీ సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రాల దర్శనానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- కాకినాడ ఆర్టీసీ డీఎం

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆర్టీసీ డిపో నుంచి పంచామరక్షేత్రం దర్శనం, శబరిమల అయ్యప్పస్వామి దర్శనం, వివిధ పుణ్యక్షేత్రాలకు భక్తులకు ఆర్టీసీ బస్సు అద్దెకు ఇవ్వనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ ఎంయువీ మనోహర్ తెలిపారు. కాకినాడ ఆర్టీసీ డిపోలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కార్తీకమాసంలో పంచారామ దర్శనం, శబరిమల అయ్యప్ప దర్శనం టిక్కెట్లపరంగా గానీ, మొత్తం బస్సు అద్దె ప్రాతిపదికన 20 బస్సులు అందుబాటులో ఉంచామని డిపో మేనేజర్ తెలిపారు. అనంతరం పంచారామ అయ్యప్పస్వామి దర్శనం పోస్టర్‌లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ బాలకృష్ణ, ఎస్ఎం శ్రీనివాసరావు, పీఆర్వో రాజు పాల్గొన్నారు.

సరోగసీ, స్కానింగ్ సెంటర్లకు అనుమతులు తప్పనిసరి

- డీఎంహెచ్‌వో నరసింహనాయక్

జీజీహెచ్(కాకినాడ), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న సరోగసి, స్కానింగ్ సెంటర్లకు రిజిస్ట్రేషన్ అనుమతులు తప్పనిసరి అని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ పేర్కొన్నారు. కాకినాడ నూకాలమ్మ గుడి సమీపంలోని సంజీవి ఆస్పత్రిలో మెడ్‌వే సంస్థ ఏర్పాటు చేసిన సరోగసీ కేంద్రాన్ని గురువారం ఆయన జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి, రేడియాలజిస్ట్ డాక్టర్ సునీత, పేథాలజిస్ట్ డాక్టర్ రాజ్యలక్ష్మిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అసిస్టెడ్ రీప్రొడెక్టివ్ టెక్నాలజీస్(ఏఆర్‌టీ) సరోగసీ, పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్‌కు సంబంధించిన ఆస్పత్రుల యాజమాన్యం, డయాగ్నోస్టిక్ సెంటర్ల నిర్వాహకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనలు పాటిస్తూ ఈ చట్టాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేయడంలో సహకరించాలన్నారు. జిల్లాలోని ఏ ఆస్పత్రి కానీ, డయాగ్నోస్టిక్ సెంటర్ కానీ నమోదు కాకుండా ఏఆర్‌టీ, సరోగసీ, పీసీ అండ్ పీఎన్‌డీటీ కేంద్రాలను నిర్వహిస్తే చట్టరీత్యా శిక్షార్హులని హెచ్చరించారు. ఎవరైనా రిజిస్ట్రేషన్ కాకుండా కేంద్రాలను నిర్వహిస్తుంటే జిల్లా పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్ టోల్‌ఫ్రీ నెంబర్ 18004253365 లో తెలియజేయాలని కోరారు. వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.



నిర్ధారణ యంత్రాన్ని పరిశీలిస్తున్న వైద్య నిపుణుల బృందం

పశువుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): జంతు హింసా నివారణ సంఘం ఆశ్రయంలో ఉన్న పశువుల పోషణ, ఆరోగ్య రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో మున్సిపల్, పశుసంవర్ధకశాఖ, రెవెన్యూ అధికారులతో జంతు హింసా నివారణ సంఘం నిర్వహణ అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల తరచూ వర్షాల కురుస్తూ చిత్తడి వాతావరణం నెలకొంటున్న నేపథ్యంలో ఎస్పీసీఏ ఆశ్రయంలో ఉన్న పశువుల ఆలనాపాలనా ప్రత్యేక దృష్టిసారించి ఎలాంటి వ్యాధులు సోకకుండా చూడాలన్నారు. తగిన పరిమాణంలో పశువులకు దాణా సరఫరా చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఎస్పీసీఏ నిర్వహిస్తున్న తీరుపై పరిశీలన అధికారిగా జేసీని నియమించామన్నారు. లోపాల నవరణ, సమర్ధ నిర్వహణ అంశాలపై సూచనలతో ఈనెల 24లోగా నివేదిక సమర్పించాలన్నారు. షాపులఅద్దెల ద్వారా ఎస్పీసీఏకు రావాల్సిన ఆదాయాలను సక్రమంగా వసూలు చేయాలని కమిషనర్‌కు సూచించారు. సమావేశంలో కాకినాడ కమిషనర్ భావన, డిప్యూటీ కమిషనర్ మనోహర్, ఎంహెచ్‌ఓ పృథ్వీ, పశుసం వర్ధకశాఖ జేడీ సూర్యప్రకాషరావు, కాకినాడ అర్బన్ తహశీల్దారు జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక అవార్డు గ్రహీతకు కలెక్టర్ అభినందనలు

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పర్యాటక విశేషాలపై ఉత్తమ ప్రచురణ విభాగంలో 2024 సంవత్సరానికి గాను గోదావరి పుస్తకానికి రాష్ట్ర పర్యాటక అవార్డును సాధించిన సీనియర్ జర్నలిస్ట్ శివన్నారాయణరెడ్డిని కలెక్టర్ షాన్‌మోహన్ అభినందించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పర్యాటకంపై రాసిన ఐదు పర్యాటక పుస్తకాలకు రాష్ట్రస్థాయిలో ఐదు అవార్డులు రావడం జిల్లాకే గర్వకారణమన్నారు.

ధాన్యం రవాణా వాహనాలకు జీపీఎస్ అమర్చుకోవాలి: జేసీ

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ ధాన్యం సేకరణలో భాగంగా కల్లాలనుంచి ధాన్యాన్ని సీఎంఆర్ రైస్‌మిల్లులకు రవాణా చేసేందుకు వచ్చే ట్రాన్స్‌పోర్టు ఏజెన్సీల వాహనాలకు జీపీఎస్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని జేసీ రాహుల్‌మీనా కోరారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన చాంబర్‌లో ట్రాన్స్‌పోర్టు ఏజెన్సీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లాల నుంచి రైతులు ధాన్యాన్ని నిర్ధేశించిన సమయానికి సీఎంఆర్ రైస్‌మిల్లులకు చేర్చాలన్నారు. తమ వాహనాలను విధిగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాలశాఖ మేనేజర్ దేవుల నాయక్ పాల్గొన్నారు.

జిల్లాలో వర్షం

- తీరంలో అలల ఉధృతి
- ఉప్పాడలో మత్స్యకార గ్రామాలపై విరుచుకుపడుతున్న రాకాసి అలలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో వర్షం పడింది. కొన్నిచోట్ల భారీ కురవగా కొన్నిచోట్ల స్వల్పంగా పడింది. కాగా, కొత్తపల్లి మండలం ఉప్పాడలో అలల తీవ్రత అధికంగా ఉంది. రాకాసి అలలు మత్స్యకార గ్రామాలపై విరుచుకుపడుతున్నాయి. కెరటాల ధాటికి బీచ్‌రోడ్డుపై నీరు వస్తోంది.

కొత్తపల్లి, అక్టోబరు 17: కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో అలల ఉధృతి తీవ్రంగా ఉంది. గురువారం ఉదయం నుంచీ సాధారణంగా ఉన్న తీరంలో సాయంత్రం నుంచి ఈదురుగాలులు పెరిగాయి. దీంతో రెండు నుంచి మూడు మీటర్ల ఎత్తులో కెరటాలు ఎగిసిపడుతూ తీరాన్ని కబళిస్తున్నాయి. బీచ్‌రోడ్డులో విద్యుత్‌ప్లాంటు సమీపంలో చిన్న వంతెనపైనుంచి అలలు తారా స్థాయిలో ఎగిసిపడుతున్నాయి. రాత్రి 9 గంటల సమయంలో సముద్రం లోపల నుంచి దూసుకొచ్చిన కెరటాల ధాటికి తారురోడ్డు అడుగుభాగంలో కంకరరాళ్లు బీచ్‌రోడ్డుపైకి పడుతున్నాయి.



కొత్తపల్లి మండలం ఉప్పాడలో మత్స్యకారుల ఇళ్లను తాకుతున్న సముద్ర కెరటాలు

పలుచోట్ల వాన

పిఠాపురం/గొల్లప్రోలు/కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంతో పాటు గొల్లప్రోలు, కాకినాడల్లో గురువారం భారీ వర్షం కురిసింది. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాతనుంచి గురువారం ఉదయం 10గంటల వరకూ పలుమార్లు వర్షం పడింది. దీనితో ఎక్కడిక్కడ రహదారులపై నీరు ప్రవహించింది. గొల్లప్రోలులో కురిసిన భారీ వర్షంతో రహదారులు జలమయమయ్యాయి. గురువారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ నాలుగు విడతలుగా కురిసిన వర్షంతో డ్రెయిన్లు పొంగిపొర్లాయి. కాకి నాడలో గురువారం వర్షం ఆగుతూ.. బాదుతూ కురిసింది. రాత్రి పది గంటలకు వర్షం పడింది.



పిఠాపురంలో వర్షం కురుస్తున్న దృశ్యం

సుద్దగడ్డకు మళ్లీ వరద

గొల్లప్రోలు, అక్టోబరు 17: సుద్దగడ్డకు మళ్లీ వరద వచ్చింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద నీటితో గొల్లప్రోలువద్ద సుద్దగడ్డ(కొండ)కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. గురువారం పట్టణ శివారులోని జగనన్న కాలనీ రహదారిపైకి వరద నీరు చేరింది. దీనితో కాలనీ వాసులు ఆ నీటిలో నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలుకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తల్లిదండ్రులు, కాలనీవాసులు వారిని వరద నీటిని దాటిస్తున్నారు. మూడు నెలల వ్యవధిలో ఏడోసారి రహదారిపైకి వరద నీరు చేరడంతో కాలనీవాసులకు కష్టాలు తప్పడం లేదు.

'పల్లె పండుగ'లో శరవేగంగా శంకుస్థాపనలు

- ఇప్పటివరకు 233 పనులకు
- గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 17: జిల్లాలో పల్లె పండుగ కార్యక్రమంలో గ్రామాల్లో అభివృద్ధి పనులకు వేగంగా శంకుస్థాపనలు జరుగుతున్నాయి. గత నాలుగు రోజుల్లో రూ.27కోట్ల విలువైన 233 పనులకు ఎంపీలు, ఎమ్మెల్యేలు శంకుస్థాపనలు చేశారు. దీనిలో సీసీరోడ్ల నిర్మాణాలు, సీసీ డ్రెన్ల నిర్మాణాలున్నాయి. మొత్తంగా జిల్లాకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకం నిధులు రూ.81కోట్లు కేటాయించగా 857 పనులకు శంకుస్థాపనలు చేయాల్సి ఉండగా ఇప్పటికే 233 పనులకు కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించారు. జిల్లాలో 385గ్రామపంచాయతీలు ఉండగా ఇప్పటివరకు 107 పంచాయతీల్లో ఈ పనులకు ఎంతో అట్టహాసంగా శంకుస్థాపనలు చేశారు. ఈనెల 20వతేదీ కల్లా 857 పనులకు శంకుస్థాపనలు పూర్తి చేస్తామని డ్వామా పీడీ వెంకటలక్ష్మి తెలి పారు.

కరప పీఎస్ పరిసరాలపై ఎస్పీ అసంతృప్తి

కరప, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఎస్పీ విక్రాంత్‌పాటిల్ గురువారం కరప పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ పరిసరాలు, రికార్డురూమ్, కంప్యూటర్ రూమ్, ఆయుధాలను భద్రపరిచే గది, ఖైదీలను ఉంచే సెల్ పరిశీలించి పలు సూచనలు చేశారు. స్టేషన్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. భవనం శ్లాబ్ పెచ్చులూడిపోయి వర్షంనీరు పడుతుండడాన్ని ఎస్పీ పరిశీలించారు. భవనంపైకి వెళ్లేందుకు మెట్లు లేకపోవడం, నిచ్చెన వంటి ఏర్పాటుచేయకపోవడంపై సిబ్బందిని ప్రశ్నించారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. గొల్లపాలెం పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సందర్శించారు. సీఐ చైతన్యకృష్ణ, ఎస్ఐ తోట సునీత, అదనపు ఎస్ఐ మూర్తి పాల్గొన్నారు.

ఏఆర్ ఏఎస్పీగా శ్రీనివాసరావు

కాకినాడక్రైం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు(ఏఆర్) అడిషనల్ ఎస్పీగా ఎస్.శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌కు పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడ పనిచేసిన బి.సత్యనారాయణ కృష్ణా జిల్లా ఏఆర్ ఏఎస్పీగా బదిలీ అయ్యారు.



ఎస్పీకి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న ఏఎస్పీ శ్రీనివాసరావు

క్యూఆర్ కోడ్‌లో స్కాన్ చేస్తేనే వస్తువులు

- ప్రత్యేక కౌంటర్ల వద్ద ఏర్పాటు చేసిన పౌరసరఫరాలశాఖ

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాలశాఖ ఆదేశాలతో జిల్లాలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తేనే నిత్యావసర వస్తువుల విక్రయాలు జరుగుతాయి. పౌరసరఫరాలశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న 18 ప్రత్యేక కౌంటర్ల వద్ద క్యూఆర్ కోడ్ స్కాన్ చేసే విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఒక్కొక్క తెలుపు రేషన్‌కార్డుకు ప్రత్యేక కౌంటర్లవద్ద లీటరు పామాయిల్ రూ.110కి, లీటరు సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.124కి అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం తక్కువ ధరలకే వీటిని పేదవారికి అందజేస్తూ కొంత ఆర్థికభారాన్ని మోస్తోంది. ఎక్కడా అక్రమాలకు తావులేకుండా క్యూఆర్ కోడ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. తెలుపు రేషన్‌కార్డు నెంబరు, లబ్ధిదారుడి ఫోను నెంబరు క్యూఆర్ కోడ్‌లో ఎంటర్ చేసిన తర్వాత ఒక ఓటీపీ నెంబరు ఫోనుకు వస్తుంది. తర్వాత ఆ నెంబరు రిజిస్ట్రేషన్ అవుతుంది. అనంతరం ఆయిల్ ప్యాకెట్లు తక్కువ ధరకే లబ్ధిదారునికి విక్రయిస్తారు. ఒక్కో కార్డుదారుడికి 3పామాయిల్ ప్యాకెట్లు, 1సన్‌ఫ్లవర్ ప్యాకెట్ ఇస్తారన్నారు. కిలో ఉల్లి ఒకరకం రూ.46, మరో రకం రూ.40కి, కిలో టమోటా రూ.40కి అందుబాటులో ఉన్నాయి.

బకాయి బిల్లులు చెల్లించకపోతే పనులు చేయలేం

- పంచాయతీరాజ్ కాంట్రాక్టర్లు

కాకినాడ సిటీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా పేరుకుపోయిన బకాయి బిల్లులు చెల్లించకపోతే పనులు చేయలేమని పంచాయతీరాజ్ కాంట్రాక్టర్లు వెల్లడించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి 40మంది పంచాయతీరాజ్ కాంట్రాక్టర్లు కాకినాడ జగన్నాథపురంలోని పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయానికి గురువారం వచ్చారు. బిల్లులు రాకపోవడంతో పడుతున్న ఇబ్బందులు తెలిపారు. ఈ సందర్భంగా సూపరిటెండెంట్ ఇంజనీర్ ఏవీఎస్ శ్రీనివాస్ తన చాంబర్‌లో కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. కాంట్రాక్టర్లు మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు రూ.100కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. కనీసం బిల్లుల ప్రాసెస్ కూడా సరిగా చేయలేదన్నారు. దీనిపై ఎస్ఈ మాట్లాడుతూ బిల్లులు రాక కాంట్రాక్టర్లు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని చెప్పారు. ఈ సమావేశంలో కాంట్రాక్టర్లు గణేశుల రాంబాబు ఎం అర్జునరెడ్డి, అమరేంద్ర, దిడ్డి సుబ్బారావు, రాపేటి పెద్ద పాల్గొన్నారు.

ఆ పరిశ్రమలకు నోటీసులివ్వండి

- భద్రతా చర్యలు పాటించకుంటే చర్యలు తప్పవు: కలెక్టర్ హెచ్చరిక

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల్లో భద్రతా చర్యలు తీసుకోనివారికి తక్షణమే నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఫ్యాక్టరీస్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. ఎస్‌సీఎస్ ఇండస్ట్రీస్, సామి సమిత స్టోర్స్ మహితీ స్టోర్స్ ఐఎంసీ, తిరుమలేశా లాజిస్టిక్స్, అంగ్రీన్, కేటీకే బయోటెక్ పరిశ్రమల్లో ఇప్పటివరకు స్టోరేజ్ ట్యాంకుల వద్ద సెన్సార్లు, లెవెల్ ఇండికేటర్లు ఏర్పాటు చేయలేదని, దీంతో వీరికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. తక్షణమే ఈ ఏడు పరిశ్రమలకు నోటీసులు జారీ చేయాలని, లేనిపక్షంలో ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

ప్రతి పాఠశాలలోనూ స్కౌట్స్ గైడ్స్ యూనిట్లు ఏర్పాటు చేయాలి

- డీఈవో పిల్లి రమేష్

కాకినాడ రూరల్, అక్టోబరు 17: ప్రతి పాఠశాలలోనూ స్కౌట్స్, గైడ్స్ యూనిట్లు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఉత్తమ గుణాలను పెంపొందించాలని డీఈవో పిల్లి రమేష్ అన్నారు. కాకినాడ విద్యాశాఖ కార్యాలయంలో జిల్లా స్కౌట్స్ గైడ్స్ చీఫ్ కమిషనర్, డీఈవో రమేష్ అధ్యక్షతన స్కౌట్స్ గైడ్స్ జిల్లా కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించినట్లు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా 40మంది స్కౌట్స్ ఉపాధ్యాయులకు, 40మంది గైడ్ ఉపాధ్యాయినులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఎండీఎం ఏడీ నాగేశ్వరరావు స్కౌట్స్ గైడ్స్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ షంషాద్‌బేగం, సంయుక్త కార్యదర్శి వి.మాచరరావు, లక్ష్మీకుమారి, నీలిమ, సుబ్రహ్మణ్యం, హరిరాజు, రాజేశ్వరి, పద్మ పాల్గొన్నారు.



డీఈవో రమేష్‌తో సర్టిఫికెట్లు సాధించిన స్కౌట్స్ ఉపాధ్యాయులు



ఆ ఊరంతా.. నిక్‌నేమ్‌లే!

ఒరే కలెక్టర్ ఎక్కడ..
జేడీ ఇంట్లోనే ఉన్నాడా..
సంతలో ఎంపీ కనిపించాడ్రా,
మన ఎనకే సైకిలేసుకుని వచ్చేత్తాన్నాడు..
వీళ్లందరూ సరే, నేపాల్ ఎక్కడ..
బాబూమోహన్ ఇంటి దగ్గర వాజ్‌పేయి,
జమదగ్ని బాతాఖానీ పెట్టారు..
మరి రొట్టు, చట్నీ సంగతేంటి..
ఏంటీ వీళ్లందరూ అక్కడుండటమేంటీ,
ఇంతకూ ఏంటి కథా అనేకదా మీ
గందరగోళం. అదేం లేదు, ఇవన్నీ
ఒకే ఊరిలో కొందరికి ఉన్న నిక్‌నేమ్‌లు.
ఇలా మారుపేర్లతో ఈ ఊర్లో వారంతా
పిలుచుకోవడం ఎన్నో ఏళ్లుగా ఉందట.
ఆ ఊరేంటి.. ఆ కథేంటంటే..

- అసలు పేర్లు మరుగు.. మారుపేర్లతోనే పిలుపు
- బోడపాటివారి పాలెంలో సంథింగ్ స్పెషల్

ఆ గ్రామంలో అసలు పేర్లు మరుగున పడిపోయి.. మారుపేర్లు మాత్రం చలామణీ అయిపోతున్నాయి. ఆ ఊళ్లో అడ్రస్ కావాలంటే అసలు పేరు పట్టుకుని వెళితే ఇబ్బందులు పడవల్సిందే. మారుపేరు (నిక్‌నేమ్) తెలుసుకుంటేనే సంబంధిత వ్యక్తుల అడ్రస్ దొరుకుతుంది. ఆ... విచిత్ర నిక్‌నేమ్‌ల గ్రామం ఎక్కడో కాదండోయ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలంలో ఉన్న బోడపాటివారి పాలెం. ఒక వ్యక్తి వ్యవహార శైలి, తీరుతెన్నులను బట్టి ఊళ్లో ఎవరో ఒకరు ఓ పెట్టుడు పేరు తగిలించేస్తారు. తర్వాత అదే అసలు పేరు అన్నట్టు చలామణీలోకి వచ్చేస్తుంది. కొన్ని పేర్లను పరిశీలిస్తే సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ(జేడీ), యడ్లపల్లి శ్రీనివాసరావు (బాబుమోహన్), మేడిచర్ల ప్రసాద్ (ఎంపీ), బండి వెంకటేశ్వరావు (కలెక్టర్), నల్లా రామకృష్ణారావు (రెడ్డినాయుడు), పడాల వెంకటేశ్వరావు (సూపర్), యడ్లపల్లి నారాయణమూర్తి (ఉషశ్రీ), యడ్లపల్లి శ్రీను(గ్రీకు), మానేపల్లి వెంట్రాజు(పిలక), అడబాల శ్రీనివాసరావు (పెద్దోడు), బోడపాటి వీరస్వామి(బాషా), నల్లా దుర్గారావు (గంగోలి), తోట శ్రీనివాసరావు(చలం), బోడపాటి వెంకటేశ్వరావు(గఫూర్), కుంపట్ల నరసింహరావు (సంప్రదాయం), బోడపాటి రామకృష్ణ(జమదగ్ని), నల్లా దుర్గా నరసింహరావు(చట్నీ), అడబాల దుర్గారావు(రొట్టు), చినిమిల్లి సతీష్ (వాజ్‌పేయి), పోలిశెట్టి గణపతి (నేపాల్) ఇలా.. ఆ గ్రామంలో చాలామందికి ఇలా నిక్‌నేమ్‌లతో పాపులర్. ఆవిధంగా పిలిస్తేనే వారి చిరునామా తెలిసేది. ఏమిటీ మారుపేర్ల కథ.. అని గ్రామస్తులను అడిగితే ఆసక్తికరమైన కథలూ తెలిశాయి. బండి వెంకటేశ్వరావుకు కలెక్టర్ పేరు ఎలా వచ్చిందంటే ప్రతి విషయానికి నియమ నిబంధనలు చెప్తూ అజమాయిషీ చేయడంతో ఆయనకు ఆ పేరు వాడుకలోకి వచ్చింది. అలాగే యడ్లపల్లి నారాయణ మూర్తికి ఉషశ్రీ పేరు ఎలా వచ్చిందంటే.. ఆకాశవాణిలో పురాణపండ సూర్యప్రకాశ దీక్షితులు (ఉషశ్రీ) నాటికలు, పురాణాలు గురించి అర్థమయ్యే రీతిలో ప్రేక్షకులకు వినిపించేవారట. అదే తరహాలో ఈయన మాట్లాడడంతో అప్పట్లో ఆ పేరు వచ్చింది. దుర్గానరసింహరావు, దుర్గారావు చిన్నతనం నుంచి మంచి స్నేహితులు కావడంతో రొట్టె, చట్నీగా కలిసి ఉంటారని ఒకరికి రొట్టె, మరొకరికి చట్నీగా నామకరణం చేశారు. ఇలా ప్రతి ఒక్కరి మారుపేరులో ఒక కథ ఉంది. అయితే మారుతున్నకాలంతోపాటు అధికంగా విద్యావంతులు కావడంతో ఆ తరహా నిక్‌నేమ్‌లు యువత పెట్టుకోవడం లేదని గ్రామస్తులు ఒకరు చెప్పారు. గత పదేళ్ల నుంచి నిక్‌నేమ్‌ల సంప్రదాయం ముగిసిందని ఆయన నవ్వుతూ చెప్పారు. కాకపోతే అంతకుముందు వరకు నిక్ నేమ్‌లు పెట్టుకున్న వారంతా ఇప్పటికీ అదే పేర్లతో గ్రామంలో పిలుచుకుంటున్నారు.

ఈతరం ఒప్పుకోవడం లేదు..



నా పేరు సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ. నేను గెడ్డం బాగా పెంచే వాడిని. అందుచేత నాకు జేడీ (హీరో జేడీ చక్రవర్తి) అనే పేరును మా గ్రామస్తులు పెట్టారు. ఆ పేరే ప్రస్తుతం వాడుకలో ఉంది. మా ముందు తరంతోపాటు మాతరం వరకే ఈ నిక్ నేమ్‌లు పరిమితయ్యాయి. ప్రస్తుత తరం నిక్‌నేమ్‌లకు ఒప్పుకోవడం లేదు. మా గ్రామంలో మాతరం వారికి సుమారు 90 శాతం వరకు మారుపేర్లు ఉన్నాయి. వాటితోనే మేం పిలుచుకుంటాం. ఎవరిని ఎలా పిలిచినా సరదాగానే తీసుకుంటాం.

సంతకానికే నా పేరును వాడతా..



నా పేరు నల్లా రామకృష్ణరావు. మారు పేరు రెడ్డి నాయుడు. నా పదేళ్ల వయస్సులో నాకు రెడ్డినాయుడు అనే పేరును మా బంధువులతోపాటు గ్రామస్తులు పిలిచేవారు. అప్పటినుంచి ఆ పేరే వాడుకలోకి వచ్చింది. నా అసలు పేరును సంతకానికి మాత్రమే వాడతాను. నా అసలు పేరు ఎవ్వరికీ తెలియదు. మా గ్రామంలో సొంత పేరుతో అడ్రస్ కావాలంటే కాస్త ఇబ్బంది పడవల్సిందే. నిక్‌నేమ్, తండ్రి పేరు తెలిస్తేనే అడ్రస్ దొరుకుతుంది.


- పి గన్నవరం (ఆంధ్రజ్యోతి)



పులుల గుట్ట.. దూగుట్ట!

- దూవ్ అంటే గిరిజన భాషలో పులి
- నాడు దూవ్ గుట్ట.. నేడు దూగుట్ట
- పెద్దపులి సంచారంతో మరోసారి చర్చ

కూనవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కూనవరం మండల పరిసర ప్రాంతాల్లో పులుల సంచారంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. కానీ ఈ ప్రాంతానికి పులుల సంచారం కొత్త కాదు. పూర్వం నుంచి పులులు ఈ ప్రాంతంలో సంచరిస్తూనే ఉండేవి. ఊరిలోకి వచ్చి పశువులపై దాడి చేసేవి. కళ్ల ముందే పెంచుకున్న మేకలను ఎత్తుకుపోయేవి. పూర్వం పులులు అన్నీ కలిసి దూవ్ గుట్ట అనే ప్రాంతాన్ని ఆవాస కేంద్రంగా ఏర్పరచుకునేవి అని పెద్దలు చెప్తుండేవారు. దూవ్ అంటే గిరిజన భాషలో పులి అని అర్థం. పులులన్నీ ఆ గుట్ట మీద ఉండేవి కాబట్టి ఆ గుట్టను దూవ్ గుట్ట అనేవాళ్లు. ఆ దూవ్ గుట్ట రానురాను దూగుట్టగా మారిపోయింది. నాలుగురోజుల కిందట మండలంలో అడుగుపెట్టిన పులి కూడా మొదట దూగుట్ట పరిసర ప్రాంతాల్లోకి వచ్చింది. మొదట గ్రామాల దగ్గరల్లోకి వచ్చిన పులి ఇప్పుడు తన రూటు మార్చింది. దట్టమైన అడవుల్లోకి వెళ్తోంది. పులిని కనుక్కోవడం అటవీ శాఖాధికారులకు సవాలుగా మారింది. ఫారెస్టు అధికారులు ఒకవైపు ట్రాప్ కెమెరాలు అమరిస్తే పులి మరోవైపు వెళుతోంది.





పది నాణెం.. చెలా'మనీ!'

- రూ.10 కాయిన్లను తిరస్కరిస్తున్న వ్యాపారులు, జనం
- ప్రధానంగా వ్యాపారులు తీసుకోక పేరుకుపోయిన నిల్వలు
- బ్యాంకులు, అధికారులతో ప్రత్యేక డ్రైవ్
- అధికారుల టార్గెట్‌తో వ్యాపారస్తులకు భారీగా పది కాయిన్లు అప్పగింత
- ఒక్కసారిగా చలామణిలోకి వచ్చిన కాయిన్లు
- కొనుగోలుదారులకు అధికంగా ఈ కాయిన్లే అప్పగిస్తున్న వ్యాపారులు
- పది కాయిన్లు చెల్లుతాయి : కాకినాడ జిల్లా కలెక్టర్

కార్పొరేషన్ (కాకినాడ)/ఆంధ్రజ్యోతి : కొత్త పది రూపాయల కాయిన్స్ అసలు చెల్లుబాటులో ఉన్నాయా.. లేదా.. అన్నది ప్రతీ ఒక్కరి మనసులో ఉన్న ప్రశ్న. ఎందుకంటే రూ.10 కాయిన్స్ ఏ వ్యాపారులూ ఎవరూ తీసుకోవడం లేదు. వినియోగదారులకు ఇచ్చినా వారూ వద్దని చెప్పేస్తున్నారు. ఇది దాదాపు ఏడాదిన్నర నుంచి జరుగుతున్న తంతు. ఆటో ఎక్కి.. దిగిన తర్వాత రూ.10 కాయిన్ ఇస్తే.. ఇది చెల్లదు అని సమాధానం వస్తుంది. ఏ షాపునకు వెళ్లినా.. పెట్రోల్ బంక్ అయినా, ఛాయ్ దుకాణమైనా.. ఇదే ఆన్సర్. కాస్త అవగాహన ఉన్నవారు.. అరె.. రూ.10 కాయిన్స్ వాడుకలోనే ఉన్నాయి అంటే.. 'ఏమో మా దగ్గర ఎవరూ తీసుకోవడంలేదు అందుకే మేము కూడా తీసుకోవడం మానేశాం'.. ఇది ఎదురువారి నుంచి తిరిగి వస్తున్న సమాధానం. సాధారణంగా రిజర్వ్ బ్యాంక్ జారీ చేసే డబ్బులకు మార్కెట్‌లో ఎలాంటి అడ్డంకులు ఉండవు. కానీ పది రూపాయల నాణెం విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. పది రూపాయల నాణెం చెల్లదనే అపోహ ప్రజల్లో చాలా బలంగా ఉంది. వాస్తవానికి ఇది ఎలా మొదలైందో తెలియదు గానీ పది రూపాయల నాణెం చెల్లదనే వాదన జనాల్లో బలంగా నాటుకుపోయింది. ఎలాంటి ఆకృతిలో ఉన్నప్పటికీ పది రూపాయల నాణెం చెల్లుతుందని ఆర్‌బీఐ ఇప్పటికే పలుమార్లు స్పష్టంచేసింది. అందువల్ల పది రూపాయల కాయిన్‌ను నిరాకరించవద్దని స్పష్టమైన ఆదేశాలు సైతం జారీ చేసింది. ఒకవేళ ఈ కాయిన్‌లను నిరాకరిస్తే చట్టప్రకారం, శిక్షార్హులు కూడా అవుతారని ఇప్పటికే పలుమార్లు హెచ్చరించింది అయినా పాతుకుపోయిన అపోహల కారణంగా పది రూపాయల నాణెం ఇస్తే మాత్రం తీసుకోమని చెప్పేస్తున్నారు. నిజానికి కూరగాయల వ్యాపారులు, చిన్నచిన్న హోటళ్లు, కిరాణా, బడ్డీకొట్టు చిరు వ్యాపారులు చిల్లర నాణేల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాగా నలిగిపోయిన పది రూపాయల నోటైనా తీసుకుంటున్నారే తప్ప పది నాణేలను తీసుకోవడానికి ఆసక్తి చూపించడంలేదు. పెట్రోల్ బంకుల్లో వాహనదారులు రూ.10 నాణేలు ఇచ్చి నా సిబ్బంది తిరస్కరిస్తున్నారు. చిన్నవ్యాపారులు అవగాహన లేక నాణేలు తిరస్కరిస్తున్నారంటే వారిలో ఉన్న భయాలకు అర్థం ఉంది. కానీ కేంద్ర పెట్రోలియం సంస్థల ద్వారా నడిచే పెట్రోల్ బంకుల్లో సైతం తిరస్కరించడం విడ్డూరంగా ఉందని ఆశ్చర్యపోతున్నారు.



పలు డిజైన్లలో పది నాణేలు

2009 మార్చి నుంచి 2017 జూన్ మధ్యకాలంలో 14 సార్లు పది రూపాయల నాణేలను ఆర్‌బీఐ విడుదల చేసింది. ఆయా సందర్భాల్ని బట్టి కాయిన్లను పలు డిజైన్‌లో విడుదల చేసింది. మాములుగా అయితేగా రూ.10 నోట్ల మార్పిడి ఎక్కువగా జరుగుతుంది. నోట్లు చేతులు మారే కొద్దీ త్వరగా పాడవుతుంటాయి. ఈ ఇబ్బందులను అధిగమించేందుకు ఆర్‌బీఐ, మిగతా నాణేలతోపాటు రూ.10 నాణేలను ముద్రిస్తోంది.

కొద్దిరోజులుగా కాయిన్ల చలామణీ

కాయిన్ల చలామణీ ఆగిపోవడంతో బ్యాంకుల్లో అవి గుట్టలు గుట్టలుగా నిల్వ ఉండిపోయాయి. దాంతో ఆర్‌బీఐ కూడా జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. తాజాగా నేరుగా అధికారులు కూడా ఈ కాయిన్ల చలామణీ కోసం అవగాహన కార్యక్రమాలను ప్రారంభించారు. టార్గెట్లు పెట్టి మరీ బ్యాంకుల నుంచి వ్యాపార సంస్థలకు అప్పగిస్తున్నారు. దీంతో ఒక్కసారిగా నాణేలు పెద్ద ఎత్తున మార్కెట్‌ను ముంచెత్తాయి. డీమార్ట్‌కి వెళ్లినా, లేదా మెడికల్ షాపుకెళ్లినా, ఏదైనా నిత్యావసరాల దుకాణానికి వెళ్లినా ఇప్పుడు తిరిగి ఇచ్చే చిల్లరలో కచ్చితంగా రూ.10 కాయిన్లు ఉండేలా చూస్తున్నారు. వద్దని కొనుగోలుదారులు తిరస్కరించినా, అవి చెలామణీలో ఉన్నాయని సమాధానం ఇస్తున్నారు. అయితే తిరిగి తీసుకోవడంలో మాత్రం వ్యాపారులు చొరవ చూపించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. దీనిపై అధికారులు సైతం దృష్టి పెట్టి తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది.

పది నాణెంపై అపోహలు వద్దు..

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 17: పది రూపాయల నాణెంపై ఎలాంటి అపోహలు వద్దని, ఇవి చెల్లుబాటు అవుతాయని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. ప్రజల్లో పది నాణెం చెల్లుబాటుపై ఉన్న అపోహలను తొలగించడంకోసం ఆర్‌బీఐ ఆదేశాల మేరకు యూనియన్ బ్యాంకు నేతృత్వంలో కలెక్టరేట్‌లో పది నాణేలను కలెక్టర్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది నాణేన్ని తిరస్కరించవద్దన్నారు. మేనేజర్లు వెంకట సురేష్ కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.



కాకినాడ వివేకానంద పార్కులోని స్కేటింగ్ రింక్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

నేటి నుంచి కాకినాడలో రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలు

13 జిల్లాల నుంచి 400మంది క్రీడాకారులు హాజరు

కాకినాడ అర్బన్, అక్టోబరు 17: పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో 68వ రాష్ట్ర అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ కాకినాడలో శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. కాకినాడ రాజాట్యాంక్ వైఎస్సార్ స్కేటింగ్ రింక్‌లో పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు స్కూల్‌గేమ్స్ జిల్లా కార్యదర్శి జార్జి తెలిపారు. అండర్-11, 12, 17 విభాగాల్లో జరిగే పోటీలకు 13 జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు హాజరవుతున్నారు. ఈనెల 18 నుంచి 20 వరకు పోటీలు నిర్వహిస్తారన్నారు. ప్రారంభోత్సవానికి కలెక్టర్ షాన్‌మోహన్, డీఈవో పి.రమేష్‌లు పాల్గొంటారని తెలిపారు.



కాకినాడ సమీపంలోని ఉప్పాడ రహదారిలో సముద్రతీర ప్రాంతం వద్ద గురువారం ఆకాశంలో హరివిల్లు కనిపించిన దృశ్యం. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్/కాకినాడ

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 16,449 మంది ఓటర్లు

వచ్చే నెల 6న తుది జాబితా

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 16,449 మంది ఓటుకోసం దరఖాస్తు చేసుకున్నారు. దీనిలో 13,678 మంది ఓటర్లతో ముసాయిదా ఓటర్ల జాబితాను గతంలోనే ప్రచురించారు. ఈనెల 15వ తేదీ వరకు మరో 2771మంది ఉపాధ్యాయులు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవడంతో ఆ సంఖ్య 16,449కి చేరుకుంది. ఈ నేపథ్యంలో 2771 మంది ఉపాధ్యాయుల దరఖాస్తులను ఎన్నికల రిటర్నింగ్ అధికారి పరిశీలించిన తర్వాత ఓటరు జాబితాలో నమోదు చేస్తారు. వచ్చేనెల 6న ఉపాధ్యాయ ఎమ్మెల్సీల ఓటర్ల తుది జాబితా ఆరు జిల్లాల్లో ప్రచురించి అభ్యంతరాలు స్వీకరిస్తారు.



అండర్-15 జాతీయ చెస్‌కు ఎంపికైన యశస్వి

సర్పవరం జంక్షన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ పి.వెంకటాపురం కేంద్రీయ విద్యాలయానికి చెందిన పదో తరగతి విద్యార్థి సూరాడ యశస్వి సత్యగంగాధర్ అండర్-15 జాతీయ చెస్ పోటీలకు ఎంపికయ్యాడు. గుంటూరులో ఈనెల 15 నుంచి 17దాకా నిర్వహించిన అండర్-15 చెస్ ఓపెన్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచి ప్రథమస్థానంలో నిలిచాడు. దీంతో త్వరలో తమిళనాడులో జరిగే జాతీయస్థాయి అండర్-15 చెస్ ఓపెన్ టోర్నమెంట్‌కు ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికయ్యాడు. ఇటీవల గుజరాత్ అహ్మదాబాద్‌లో నిర్వహించిన 53వ కేంద్రీయ విద్యాలయాల 2024-25 జాతీయస్థాయి చెస్ టోర్నమెంట్‌లో సత్తాచాటి గోల్డ్ మెడల్ సొంతం చేసుకున్నాడు. జాతీయస్థాయి చెస్ టోర్నమెంట్‌కి ఏపీ నుంచి ఎంపికైన సత్య గంగాధర్‌ను కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ బి.శేఖర్ అభినందించారు.

పోటీలకు క్రీడాకారుల ఎంపిక

వేళంగి(కరప), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆటల పోటీలకు వేళంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు క్రీడాకారులు ఎంపికైనట్టు హెచ్‌ఎం జి.భారతి తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో జరిగిన వివిధ అథ్లెటిక్స్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు దుర్గాప్రసాద్, రాంబాబు, వీరమణికంఠ, భగవాన్, అభిరామ్, మనీషా, వీరేంద్ర, ప్రవీణ్ జోష్, వీరదుర్గ, సాయిరితిక, వరలక్ష్మి, లక్ష్మీదీప్తి, సాయిసుధ ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. ఈనెల 24 నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో వీరంతా పాల్గొంటారని వివరించారు. ఎంపికైన క్రీడాకారులు, తర్ఫీదునిచ్చిన పీడీ సీహెచ్ కృష్ణలను పలువురు ప్రముఖులు అభినందించారు.

సత్యదేవుడి గిరిప్రదక్షిణ ఏర్పాట్లపై అధికారుల పరిశీలన



గిరిప్రదక్షిణ మార్గంలో ఏర్పాట్లపై పరిశీలన చేస్తున్న అధికారులు

- నవంబరు 15న కార్తీక పౌర్ణమి రోజున గిరిప్రదక్షిణ
- గతంలో పల్లకీ, సత్యరథం ఒకేసారి పయనం

అన్నవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి జరిగే ఉత్సవాల్లో అత్యంత ప్రాధాన్యం కలిగిన గిరిప్రదక్షిణ ఏర్పాట్లకు సంబంధించి అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. ఈ ఏడాది నవంబరు 15న కార్తీక పౌర్ణమి రోజున గిరిప్రదక్షిణ జరగనుంది. దీనిలో భాగంగా గురువారం దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు, ఆలయ అధికారులు గిరిప్రదక్షిణ జరిగే 8.4 కిలోమీటర్లను పరిశీలించారు. భక్తులు అధికంగా పాదరక్షలు లేకుండా ఈ కార్యక్రమంలో పాల్గొననుండడంతో దారిమార్గంలో రాళ్లు, రప్పలు, పిచ్చిమొక్కలు లేకుండా తొలగించడంతోపాటు, అవసరమైన ప్రదేశంలో క్వారీ క్రష్ వేయాలని నిర్ణయించారు. అదేవిధంగా భక్తులకు ఎక్కడెక్కడ పానీయాలు, పళ్లు, మజ్జిగ పంపిణీ స్టాల్స్ ఏర్పాటు చేయాలనే అంశంపై నివేదికను సిద్ధంచేశారు. దీనిని ఈవో దృష్టిలో ఉంచి తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఈ పర్యవేక్షణలో ఈఈ రామకృష్ణ, సహాయ కమిషనర్ రామ్మోహనరావు, ఏఈవో కొండలరావు, సూపరింటెండెంట్ బలువు, సత్యశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలాఉండగా భక్తుల రద్దీ దృష్ట్యా గతంలో మాదిరిగా కాకుండా స్వల్ప మార్పులు చేపట్టనున్నారు. దీనిలో భాగంగా 15వ తేదీ ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి సత్యదేవుడిని పల్లకీలో గిరిప్రదక్షిణ చేయిస్తారు. మధ్యాహ్నం సత్యరథంపై మరోసారి రత్న, సత్యగిరిలు చుట్టూ ప్రదక్షిణ చేయాలని నిర్ణయించారు. గతంలో సత్యరథం, పల్లకీ ఒకేసారి బయల్దేరగా సుమారు లక్షమంది వరకు వీటి వెంట ప్రదక్షిణ చేసేవారు. గిరిప్రదక్షిణ పూర్తయ్యాక భక్తులు రత్నగిరికి చేరుకుని స్వామిని దర్శించుకునేవారు. దీని వల్ల స్వామివారి దర్శనాలు, వ్రతాలు చేసుకునే భక్తులు, గిరిప్రదక్షిణ పూర్తయిన భక్తులు ఒకేసారి స్వామిదర్శనానికి విచ్చేస్తుండడంతో దర్శనంకోసం గంటలకొద్దీ వేచి ఉండాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. నూతన విధానం వల్ల కొందరు భక్తులు పల్లకీ వెంట, కొందరు సత్యరథం వెంట గిరి ప్రదక్షిణలో పాల్గొంటారని భావిస్తున్నారు.





పాపన్న విగ్రహం వద్ద కూర్చున్న మహిళలు.. తాడిపర్రులో ఇరువర్గాలను శాంతింపజేస్తున్న అధికారులు

సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహం వద్ద వివాదం

- తాడిపర్రులో ఉద్రిక్తత
- విగ్రహం ముసుగు తొలగింపు
- రెండు సామాజిక వర్గాల మధ్య వివాదం
- శాంతింపజేసిన అధికారులు

నిడదవోలు (ఉండ్రాజవరం), అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం మండలం తాడిపర్రు గ్రామంలో సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహం ముసుగు తొలగింపుతో రెండు సామాజిక వర్గాల మధ్య గురువారం ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే తాడిపర్రులో సుమారు రెండేళ్ల కిందట గౌడ సామాజిక వర్గీయులు గ్రామంలోని అజ్జరం రోడ్డులో సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే అప్పుడు ఈ విగ్రహం ఏర్పాటును కాపు సామాజిక వర్గం వ్యతిరే కించడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. అప్పటి నుంచి గ్రామంలో 144 సెక్షన్ అమలులో ఉంది. ఈ నేపథ్యంలో విజయదశమి ఉత్సవాల ముగింపు సందర్భంగా గ్రామంలో అమ్మవారి ఊరేగింపులో చెలరేగిన ఘర్షణలో కోపోద్రిక్తులైన గౌడ వర్గానికి చెందిన మహిళలు బుధవారం పాపన్న గౌడ్ విగ్రహానికి ఉన్న ముసుగును తొలగించినట్టు సమాచారం. అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటనతో అధికారులు అప్రమ త్తమై 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేశారు. ఇరు వర్గాల మధ్య ఉద్రిక్త వాతావరణం ఏర్పడడంతో గ్రామంలో పీస్ కమిటీని ఏర్పాటు చేశారు. విగ్రహం వద్ద పెట్రోలు సీసాలు చేతపట్టి మహిళలు చేస్తున్న నిరసనను ఆర్డీవో రాణి సుస్మిత శాంతింపజేశారు. ఇరువర్గాలతో దఫదఫాలుగా చర్చలు జరిపారు. 144 సెక్షన్ అమలులో ఉండగా విగ్రహం ముసుగును తొలగించడం నేరమని చెప్పారు. సుదీర్ఘ మంతనాల అనంతరం పాపన్నగౌడ్ విగ్రహం చుట్టూ గుడ్డను కట్టి సమస్యను పరిష్కరించారు. సుమారు 18 నెలలుగా ఈ వివాదం కొనసాగుతోంది. ఎట్టకేలకు గురువారం రాత్రికి సమస్యను అధికారులు ఒక కొలిక్కి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వివివి రామారావు, ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు వివిధ శాఖల సిబ్బంది ఉన్నారు.

సత్యదేవుడి సాక్షిగా ఒక్కటైన 150 జంటలు

అన్నవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో గురువారం నూత న దంపతులతో సందడి నెలకుంది. బుధవారం రాత్రి 8.30, 12.30 ముహుర్తాలలో దేవస్థానంలో సత్యదేవుడి సాక్షిగా 150 జంటలు ఒక్కటయ్యాయి. వీరితోపాటుగా వివిధ ప్రాంతాలలో వివాహం చేసుకున్న జంటలు స్వామివారి వ్రతమాచరించుకున్నారు. వీరికి ఇబ్బందులు కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. సుమారు 500 కొత్తజంటలు వివిధ సమయాలలో సత్యదేవుడి వ్రతమాచరించుకున్నారు. గురువారం ఒక్కరోజు వివిధ విభాగాల ద్వారా స్వామివారికి రూ.40 లక్షలు ఆదాయం లభించింది.


సత్యదేవుడి వ్రతాలాచరిస్తున్న నూతన దంపతులు

వినాయక సదన్‌కు రూ.3లక్షలు విరాళం

అయినవిల్లి, అక్టోబరు 17ఆంధ్రజ్యోతి): అయినవిల్లిలో వినాయక సదన్‌లో ఒక వసతి గది ఆధునికీకరణకు గురువారం అయినవిల్లికి చెందిన మద్దింశెట్టి బ్రహ్మయ్య కుమార్తె నల్లం లక్ష్మీనరసయమ్మ, భర్త బాలకృష్ణారావు పేరున వారి సంతానం రూ.3లక్షలు విరాళం అందజేశారు. వీరికి ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించి శ్రీస్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి దాతను అభినందించారు.


దాతకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న దృశ్యం

భక్తుడికి దేవస్థానం కాంట్రాక్టు ఉద్యోగి టోకరా

● నకిలీ గదుల రసీదుతో మోసం

అన్నవరం, అక్టోబరు 17: అన్నవరం దేవస్థానంలో ఒక కాంట్రాక్టు ఉద్యోగి నకిలీ గదుల బుకింగ్ రసీదుతో టోకరా వేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే ఒక పెండ్లి బృందానికి బుధవారం జూన్ నెల 26న బుకింగ్ చేసుకున్న హరిహరసదన్ సత్రంగది రిజర్వేషన్ గది రసీదును ఎడిట్‌చేసి అక్టోబరు 16న బుకింగ్ చేసినట్టు పెళ్లిబృందానికి సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయ గుమస్తా సంతకాన్ని ఫోర్జరీ చేసి అందివ్వడంతో పెళ్లి బృందం ఆ రసీదుతో సత్రం వద్దకు వెళ్లగా స్కాన్ కాకపోవడంతో పెళ్లిబృందం అవాక్కయ్యారు. దీంతో వారు ఈవో కార్యాలయంలో ఫిర్యాదుచేయగా దళారీని పట్టుకుని స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలని ఈవో సూచించారు. పెళ్లి బృందం ఇబ్బందిపడకుండా కరెంటు బుకింగ్ ద్వారా అద్దెతీసుకుని సత్రం గది కేటాయించారు. దీనిపై కంప్యూటర్ వ్యవహారాలు చూసే ఉద్యోగి రమేష్ ఇది హ్యాక్ చేయడంకాదని ఏరోజు బుకింగ్‌కు ఆరోజు స్కాన్ చేస్తేనే సిస్టమ్ తీసుకుని గది కేటాయిస్తారన్నారు.

అండర్ - 14 బాలురు, బాలికల ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫుట్‌బాల్ గ్రౌండ్స్‌లో గురువారం ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా అండర్ 14 బాలురు, బాలికల జట్టు ఎంపికలు జరిగాయి. 90మంది బాలురు, 40 మంది బాలికలు హాజరయ్యారు. డీవైఈవో నారాయణరావు, ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి స్వామి, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ గౌరవ కార్యదర్శి సుంకర నాగేంద్ర కిషోర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రమణమూర్తి, జిల్లా వ్యాయామ సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఏవీడీ ప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.

దిగిరాని వంట నూనెల ధరలు

● బహిరంగ మార్కెట్లో సన్‌ఫ్లవర్ ప్యాకెట్ రూ.140, పామాయిల్ రూ.125
● మొక్కుబడిగా తగ్గింపు ధరల ప్రత్యేక కౌంటర్లు
● ఎస్‌వీ మార్కెట్, రైతు బజార్ ప్రత్యేక కౌంటర్లకు ఆదరణ శూన్యం



రాజమహేంద్రవరంఅర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్లో వంటనూనెల ధరలునేలకు దిగిరావడంలేదు. ఆయిల్ దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం 27.5శాతం మేర కస్టమ్స్ డ్యూటీ విధించడంతో ఆయిల్ ధరలు ఒక్కసారిగా భగ్గుమన్న సంగతి తెలిసిందే. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ధరల నియంత్రణ చర్యలకు పూనుకున్నా ఆశించిన ప్రయోజనం అందడంలేదు. వారం రోజుల క్రితం ఒకటి, రెండుచోట్ల సన్‌ఫ్లవర్, పామాయిల్ తగ్గింపు ధరల ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినా పెద్దగా ప్రయోజనం లేదనే అభిప్రాయం జనాల్లో వ్యక్తమవుతోంది. నేటికీ సెమీ హోల్‌సేల్, మధ్యస్థ, చిన్న కిరాణా షాపుల్లోని ఆయిల్ ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు సతమతమవుతున్నారు. రిటైల్ బహిరంగ మార్కెట్లో 910 గ్రాముల సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్ ధర రూ.136 నుంచి రూ.140లకు విక్రయిస్తుంటే, 850 గ్రాముల పామాయిల్ ప్యాకెట్ రూ.125ల ధర ఉంది. ఆయిల్ ధరలను నియంత్రించడానికి జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టినా అవి ప్రజలకు ఏ మాత్రం ఉపశమనం కల్గించడంలేదు. ధరలను నియంత్రించడం కోసం ఇటీవల ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఎస్‌వీ హోల్‌సేల్ మార్కెట్, కంబాలచెరువు సమీపంలోని నటరాజ్ రైతు బజార్‌లో తగ్గింపు ధరల కౌంటర్లు ప్రారంభించారు. సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు, అధికారులు ఎంతో అట్టహాసంగా వీటిని ప్రారంభించారు. ఈ ప్రత్యేక కౌంటర్లలో 910 గ్రాముల సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.124లకు, 840 గ్రాముల పామాయిల్ రూ.110లకు విక్రయిస్తున్నారు. తెల్లరేషన్‌కార్డుదారులకు నెలకు మూడు పామాయిల్ ప్యాకెట్లు, ఒక సన్‌ఫ్లవర్ ఆయిల్ విక్రయిస్తున్నారు. ఈ ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినా రిటైల్ మార్కెట్లో దీని ప్రభావం ఏ మాత్రం లేదనే చెప్పాలి. ధరల మోత మోగుతూనే ఉంది.

నామమాత్రంగా విక్రయాలు

ఎస్‌వీ హోల్‌సేల్ మార్కెట్, నటరాజ్ రైతుబజార్ వద్ద ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్లలో సన్‌ఫ్లవర్, పామాయిల్ విక్రయాలు నామమాత్రంగా జరుగుతున్నాయి. పెద్దగా స్పందన కనిపంచడం లేదు. ఎస్‌వీ హోల్‌సేల్ మార్కెట్ ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఊరికి దూరంగా ఉన్నట్టు ఉంటుంది. ఇక్కడే ఎక్కువ మంది హోల్‌సేల్ ఆయిల్ డీలర్లు ఉన్నారు. దీంతో ఆయా హోల్‌సేల్ షాపుల్లోనే తగ్గింపు ధరల ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. కానీ, ఈ హోల్‌సేల్ మార్కెట్ సామాన్య, మధ్యతరగతి ప్రజానీకానికి చాలా దూరంగా ఉండడం ప్రజలకు భారంగా మారింది. రైల్వేస్టేషన్ ఏరియా, కంబాలచెరువు, కోటిలింగాలపేట, స్టేడియంఏరియా, క్వారీమార్కెట్ ఏరియా, లాలాచెరువు వంటి ప్రాంతాల్లో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎక్కువమంది ఉంటారు. వీళ్లు అంత దూరం వెళ్లి నూనెలు కొనాలంటే వ్యయప్రయాసలు పడాల్సి ఉంటుంది. దీంతో ఆయిల్ ధరలు భారమైనా వీరంతా స్థానికంగా ఉండే కిరాణా షాపులను ఆశ్రయించాల్సి వస్తోంది. నటరాజ్ రైతు బజార్‌లోని కౌంటర్‌లోనూ నామమాత్రంగానే ఆయిల్ విక్రయాలు జరుగుతున్నాయి. కౌంటర్ ప్రారంభం రోజున పామాయిల్ ఒక బాక్సు, సన్‌ఫ్లవర్ ఒక బాక్సు తీసుకొచ్చారు. ఒక్కో బాక్సులో 16 ప్యాకెట్లు ఉంటాయి. పామాయిల్ ప్యాకెట్లు అమ్ముడుపోగా, సన్‌ఫ్లవర్ ప్యాకెట్లు నేటికీ ఇక్కడ విక్రయిస్తున్నారు. మెయిన్‌రోడ్డు, జాంపేటలోనూ ఒక్కో కౌంటరు ఏర్పాటు చేసినట్టు చెబుతున్నా అవి ఎక్కడున్నాయనేదానిపై ప్రజలకు సమాచారం లేదు. అన్ని రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తే ధరలు కొంతలో కొంతైనా అదుపులోకి వస్తాయని ప్రజలు భావిస్తున్నారు.



ప్రభుత్వ ప్రత్యేక కౌంటర్లలో ధరలు

తగ్గింపు ధరలకు విక్రయాలపై వ్యాపారుల్లో నిరాసక్తత

ఇదిలావుంటే తగ్గింపు ధరలకు పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ విక్రయాలపై హోల్‌సేల్ వ్యాపారుల్లో తీవ్ర నిరాసక్తత కనిపిస్తోంది. ఇన్‌వాయిస్ కంటే తక్కువ ధరలకు విక్రయించాల్సి రావడమే దీనికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటువిషయంలో అధికారులు తమను బలవంతంగా ఒప్పించారనే భావన ఆయిల్ వ్యాపారుల్లో వ్యక్తమవుతోంది. ఇన్‌వాయిస్ ధరల కంటే తక్కువ ధరకు ఆయిల్ విక్రయించడంవల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని, ఒక్కో పామాయిల్ ప్యాకెట్‌పై రూ.9 నుంచి రూ.10లు, సన్‌ఫ్లవర్ ప్యాకెట్‌పై రూ.5 నుంచి రూ.6లు నష్టపోతున్నామని వ్యాపారులు చెబుతున్నారు. ఇలా నష్టం ఎంతకాలం భరించి విక్రయించగలమని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయిల్ ఇంపోర్టర్స్ (దిగుమతిదారులు) ఇన్‌వాయిస్‌లో ధరలు తగ్గిస్తే ఆమేరకు తాము ఎలాంటి లాభం ఆశించకుండా ప్రజలకు విక్రయించగలమని, ఇన్‌వాయిస్ కంటే తక్కువ ధరకు అమ్మాలంటే భారంగానే ఉందని హోల్‌సేల్ వ్యాపారి ఒకరు వాపోయారు.

లిక్విడ్ గంజాయి స్వాధీనం

● అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు

మోతుగూడెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మల్కాన్ గిరిజిల్లా దిసరిగూడ గ్రామం నుంచి భద్రాచలానికి అక్ర మంగా గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని మోతుగూడెం ఎస్‌ఐ కె.శివకుమార్, సిబ్బంది గురువారం అరెస్టు చేశారు. జీకే వీధి మండలానికి చెందిన పాంగి సంతోష్ దిసరిగూడ నుంచి రెండు కిలోల లిక్విడ్ గంజాయిని భద్రాచలానికి తరలిస్తున్నాడు. పొల్లూరు గ్రామ శివారున గల దారాలమ్మ ఆలయంవద్ద సంతోష్‌ను పోలీసులు పట్టుకున్నారు. దీని విలువ రూ.5లక్షలు ఉంటుందని ఎస్‌ఐ శివనారాయణ తెలిపారు. అతడి మొబైల్ సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో ఏఎస్‌ఐ రాజేశ్వరరావు, హెచ్‌సీ రవిచంద్ర, పీసీఎస్ నిబంధనరావు, ఎస్ఆర్‌కె రాజు, ఏఆర్ సిబ్బంది ఉన్నారు.

గండేపల్లిలో 14.5 కిలోల గంజాయి పట్టివేత


గంజాయి పట్టుకున్న పోలీసులు

గండేపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గండేపల్లి గ్రామ శివారున జాతీయరహదారి మీదుగా అక్రమంగా తరలిస్తున్న గంజాయిని గురువారం గండేపల్లి పోలీసులు పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు గండేపల్లి ఎస్‌ఐ యువి శివనాగబాబు తనిఖీలు చేయగా మోటారు సైకిల్‌పై ఇద్దరు వ్యక్తులు గంజాయి తరలిస్తుండడాన్ని గుర్తించారు. దీనిపై వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 14.5 కేజీల గంజాయి, మోటారుసైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. గంజాయి విలువ రూ.72,500 ఉంటుందన్నారు. పల్నాడు జిల్లాకు చెందిన కేతవత్ స్వామినాయక్, మామిళ్లపల్లి బాలగణేష్‌ను గండేపల్లి డిప్యూటీ తహసీల్దార్ దివ్య భారతి సమక్షంలో అరెస్టు చేశామన్నారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఎస్‌ఐ శివనాగబాబును అభినందించారు.

చోరీపై కేసు నమోదు

గండేపల్లి, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): బంగారం, నగదు చోరీపై కేసు నమోదు చేసినట్లు గండేపల్లి పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలో బొర్రంపాలెం గ్రామానికి చెందిన మంగిన వీర వెంకటేశ్వరరావు తన కుటుంబంతో హైదరాబాద్‌లో ఉపాధి నిమిత్తం ఉంటున్నాడని అయితే అతని సొంత ఇల్లు బొర్రంపాలెంలో ఉంది. వెంకటేశ్వరరావు హైదరాబాద్ నుంచి ఈనెల మొదటివారంలో వచ్చి దివ్యాంగ పెన్షన్ తీసుకుని హైదరాబాద్ వెళ్లినట్లు తెలిపారు. గురువారం వెంకటేశ్వరరావు ఇంటి తలుపుల తాళాలు పగలకొట్టి ఉండటంచూసి చుట్టుప్రక్కల వారు ఈ విషయాన్ని వెంకటేశ్వరరావుకు తెలిపారు. మల్లిపల్లిలో ఉంటున్న అతని మరదలు వరలక్ష్మి వచ్చి ఇంట్లో చూడగా బీరువాలో దాచుకున్న సుమారు లక్షరూపాయల విలువ చేసే బంగారు వస్తువులు, రూ.20వేలు నగదు దొంగలించారని గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్‌ఐ యూవీ శివనాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జనన మరణాల్లో ఒక్కటిగానే...

హైదరాబాదులో రసాయనాల ట్యాంకులో పడి దొంతికుర్రు కవలలు మృతి


రామ్, లక్ష్మణ్(ఫైల్)

కాట్రేనికోన, అక్టోబరు(ఆంధ్రజ్యోతి): తల్లి గర్భం నుంచి నిమిషాల వ్యవధిలో ఈ భూమిపైకి వచ్చారు. 32 ఏళ్ల తర్వాత నిమిషాల వ్యవధిలోనే ఈ భూమిని వదిలి మృత్యుఒడిలోకి చేరుకున్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం దొంతికుర్రుకు చెందిన కవలల వీడని బంధం. దొంతికుర్రుకు చెందిన వస్కా సత్యనారాయణ, సీతమ్మలకు నలుగురు కుమారులు. ఇద్దరి తర్వాత కవలలు జన్మించారు. ఉపాధి కోసం కవల సోదరులు రామ్, లక్ష్మణ్(32) హైదరాబాద్ వెళ్లారు. గుండ్లపోచంపల్లిలో ఉంటూ కూలిపనులు చేసుకుని పొట్ట పోసుకుంటున్నారు. ఈనెల 16న జీడిమెట్ల పారిశ్రామికవాడలోని మూతపడిన సాబూరి ఫార్మా ప్రైవేటు సంస్థలో ఫ్యాబ్రికేషన్ పనులకు వెళ్లారు. ఒక షెడ్‌కు ఉన్న పైప్‌లను తొలగిస్తుండగా రామ్ అదుపు తప్పి కింద ఉన్న రసాయనాల ట్యాంకులో పడిపోయాడు. రామ్ ఉక్కిరిబిక్కిరి అవుతుండగా అతడిని కాపాడేందుకు వెంటనే లక్ష్మణ్ ఆ సంపులోకి దిగాడు. స్పృహ కోల్పోయిన రామ్‌ను బయటకు తీసిన లక్ష్మణ్ సైతం నోట్లో నుంచి నురగలు కక్కుకుంటూ పడిపోయాడు. వీరిద్దరినీ ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. అప్పటికే రామ్, లక్ష్మణ్‌లు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. పుట్టుకలోను, మృత్యువులోను వీడని ఈ అన్నదమ్ముల అనుబంధాన్ని గ్రామస్తులు గొప్పగా చెప్పుకుంటున్నారు. దొంతికుర్రులో రామ్, లక్ష్మణ్‌ల మృతితో విషాదం నెలకొంది. పదేళ్ల క్రితం ఉపాధి కోసం కలిసి వెళ్లిన సోదరులు కలిసే ఈ లోకాన్ని వీడటాన్ని కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు.

గుండెపోటుతో తూర్పు డీపీవో మృతి

● గ్యాస్ నొప్పి అనుకుని ప్రభుత్వ ఆసుపత్రికి
● తెల్లవారుజామున ప్రైవేటు ఆసుపత్రికి తరలింపు
● ఉదయం 6 గంటలకు మృతి



డీపీవో మృతిపై సంతాపం తెలుపుతున్న కలెక్టర్, జేసీ తదితరులు


డీపీవో శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లా పంచాయతీ అధికారి బి.శ్రీనివాసరావు(58) గురువారం ఉదయం గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందారు. బుధవారంరాత్రి 11గంటల సమయంలో గ్యాస్ నొప్పిగా ఉందని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు.ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో డెల్టా ఆసుపత్రికి తరలించారు. ఒక స్టంట్ పూడుకుపోవడంతో ఉదయం 6గంటలకు మృతిచెందినట్టు ఆసుపత్రి యాజమాన్యం కుటుంబీకులకు చెప్పారు. దీంతో కుటుంబీకులు ఆసుపత్రి యాజమాన్యంతో కాసేపు వాగ్వాదానికి దిగారు. మరో రెండు స్టంట్‌లు ఉండడంతో ఒకటి పూడుకుపోయిన వైద్యం అందిస్తే బతికే వారని భోరుమన్నారు. వైద్య సక్రమంగా అందకపోవడంతోనే మృతిచెందిన ఆరోపించారు. గతంలో రెండుసార్లు గుండెపోటు వచ్చింది. మూడు స్టంట్‌లు పడ్డాయి. విశాఖపట్నంలో సమగ్ర శిక్ష అడిషనల్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తూ ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లాకు వచ్చారు. సెప్టెంబరు 30వ తేదీన జిల్లా పంచాయతీ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఆగస్టు నెలలో ఒక కుమార్తెకు రాజమహేంద్రవరం రూరల్ ఎంపీడీవో శ్రీని వాస్ కుమా రుడికి ఇచ్చి వివా హం జరిపిం చారు. ఈ నేప థ్యంలో ఆయన జిల్లాకు డీపీవోగా వచ్చినట్టు సమాచారం. ఆయన ఇద్దరు కుమార్తెలు డెంటి స్టులుగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన రాజమహేం ద్రవరం హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉంటున్నారు. గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా పలు శాఖల్లో విధులు నిర్వహించారు.డీపీవో భౌతికకా యాన్ని వైజాగ్‌కు తరలించారు.

డీపీవో మృతి బాధాకరం : కలెక్టర్

జిల్లా పంచాయతీ అధికారి మృతి ఎంతో బాధాకరమని జిల్లా కలెక్టర్ ప్రశాంతి అన్నారు. డెల్టా ఆసుపత్రికి కలెక్టర్ వెళ్లి శ్రీనివాసరావు పార్థివ దేహానికి పూలమాలలువేసి నివాళులర్పించి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.అనంతరం కలెక్టరేట్ సమావేశమందిరంలో శ్రీనివాసరావు మృతికి సంతాపం తెలిపారు. నిబద్ధత కలిగిన అధికారిగా బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించడం ఉన్నతాధికారుల ఆదేశాలను అనుసరించి పనులు చేపట్టేందుకు ఎపుడూ ముందుండేవారన్నారు.జేసీ చిన్నరాముడు, డీఆర్‌వో జి.నరసింహులు,ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, డీసీవో శ్రీరాములు, సీపీవో అప్పలకొండ, పలువురు జిల్లా అధికారులు 2 నిమషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.

జొన్నాడలో 40కాసుల బంగారు ఆభరణాల చోరీ

ఆలమూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడలో ఇంటి తలుపులు పగులగొట్టి ఇంట్లోని 40కాసుల బంగారు ఆభరణాలను దొంగిలించారు. ఈమేరకు ఆలమూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు వివరాలు ఇలా ఉన్నాయి. జొన్నాడకు చెందిన చిటికెన సోమరాజు తన భార్య అనారోగ్య కారణంగా ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లారు. ఎప్పటిలాగే పనిమనిషి ఇంటిని శుభ్రం చేయడానికి రావడంతో తలుపులు పగులగొట్టి ఉన్నాయి. దీంతో ఆత్రేయపురం గ్రామానికి చెందిన జానా మారుతిశివరామ్ ఇచ్చిన ఫిర్యాదులో ఇంట్లో 40 కాసుల బంగారు ఆభరణాలు దొంగిలించినట్లు పేర్కొన్నారు. ఈమేరకు రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్‌ఐ ఎం.అశోక్, క్లూస్ టీం ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయిని తరలిస్తున్న తమిళనాడు ముఠా అరెస్టు

విజయవాడ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : కాకినాడ జిల్లా తుని నుంచి తమిళనాడుకు గంజాయని తరలిస్తున్న ఇద్దరు నిందితులను పటమట పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 145 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారి వద్ద ఉన్న నాటు తుపాకీని సీజ్ చేశారు. తమిళనా డులోని చెన్నై పద్మనాభనగర్‌కు చెందిన రమేష్ వినేష్‌కుమార్, రాణిపర్తి జిల్లా మేళకుప్పం ప్రాంతానికి చెందిన కుమారన్ మరిమూర్తి స్నేహితులు. వారు చెన్నై నుంచి బుధవారం ఉదయం బయలుదేరి తునికి చేరుకున్నారు. విశాఖపట్నం నుంచి వ చ్చిన ముఠా వారికి తుని వద్ద గంజాయిని అంద జేసింది. ఈ సరుకును చెన్నైకి తీసుకెళ్లి విక్రయించా లనుకున్నారు. దీనికి వారం రోజులు ముందుగా వారు ఇదే స్కెచ్‌ను అమలు చేశారు. తుని నుంచి గంజాయిని తీసుకెళ్లి చెన్నైలో విక్రయించారు. విశాఖ ముఠా నుంచి రెండు కిలోల గంజాయిని రూ.9 వేలకు కొనుగోలు చేశారు. దాన్ని చెన్నైలో రూ.20 వేలకు విక్రయిం చారు. వారం రోజుల క్రితం వేసిన స్కెచ్ ఫలించ డంతో వారు బుధవారం ఉదయం అక్కడి నుంచి తునికి వచ్చారు. అక్కడ నుంచి గంజాయిని కారులో తరలిస్తుండగా సమాచారం రావడంతో పటమట పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు రామవర ప్పాడు రింగ్ వద్ద గురువారం తనిఖీలు నిర్వహిం చారు. వినేష్, కుమారన్ వద్ద గంజాయిని గుర్తిం చారు. వాహనాన్ని తనిఖీ చేస్తుండగా వారి వద్ద నాటు తుపాకీ ఉంది. దీనితోపాటు 145 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు ప్రస్తుతం వారిని విచారిస్తున్నారు. బిహార్‌లో ఈ తుపాకీనికి కొనుగోలు చేసినట్టు వినేష్ అంగీ కరించాడు. వినేష్ స్వగ్రామంలో వడ్డీ వ్యా పారం చేసేవాడు. అప్పటికే ఈ వ్యాపారంలో ఉన్నవారు వినేష్‌ను అడ్డుకున్నారు. వారి నుంచి రక్షించుకో వడానికి ఈతుపాకీని కొనుగోలు చేశానని వినేష్ పోలీసులకు వివరించినట్టు తెలిసింది.

వైద్య రంగంలో ఫిజియో థెరపీ కీలకం

●మెడికల్ ఎడ్యుకేషనల్ డైరెక్టర్ డాక్టర్ రఘునందన్


ఎస్పీ నరసింహ కిషోర్‌ను సత్కరిస్తున్న యాజమాన్యం

రాజానగరం, అక్టోబరు 17: వైద్య రంగంలో ఫిజియో థెరపీ కీలకపాత్ర పోషిస్తుందని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్(అకాడమిక్), డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్, మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ డాక్టర్ జి.రఘునందన్ అన్నారు. జీఎస్ఎల్ ఫిజియో థెరపీ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో రాజానగరంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన కాన్వొకేషన్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి, వైద్య విద్యార్థులకు పలు సూచనలు, సలహా లు అందించారు. యువ వైద్యులు వైద్య వృత్తిలో రోగులకు మెరుగైన సేవలందిస్తూ జీవితంలో ఉన్న త శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. మరో ముఖ్యఅతిథి జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ మాట్లాడుతూ ఫిజియోథెరపీ.. ఉపశమనంతోపాటు రోగులకు మనోధైర్యాన్ని ఇస్తుందన్నారు. తమ వద్దకు వచ్చే రోగు లమెడికల్ ఎడ్యుకేషనల్ డైరెక్టర్ డాక్టర్ రఘునందన్‌కు సేవాదృక్పథంతో సేవలందించాలని సూచించారు. మరో ముఖ్యఅతిథి, సినీనటుడు, ఎర్గోనామిక్, కార్పొరేట్ /వెల్‌నెస్ ట్రైనర్, యోగా అండ్ స్ట్రెస్ థెరపిస్ట్ డాక్టర్ భద్రం మాట్లాడుతూ రోగులకు సేవలందించడంలో ఏవిధమైన పక్షపాతం లేకుండా దయాగుణంతో మెలగా లని యువ వైద్యులకు సూచించారు. అనంతరం ఫిజియోథెరపీ వైద్య విద్యనభ్యసించిన యువ వైద్యులకు పట్టాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో భాగంగా తొలుత ముఖ్యఅతిథులను జీఎస్ఎల్ యాజమాన్యం ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేసింది. కార్యక్ర మంలో జీఎస్ఎల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ చీఫ్ పాట్రాన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, చైర్‌పర్సన్ డాక్ట ర్ గన్ని కాసింబి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గన్ని సందీప్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గన్ని సాధిక, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ గురునాథ్, సూపరింటెండెంట్ టీవీఎస్‌పీ మూర్తి, స్వంతంత్ర మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ మెడికల్ సూప రింటెండెంట్ డాక్టర్ ఎన్.వేణుగోపాల్, జీఎస్ఎల్ ట్రస్టు డైరెక్టర్ డాక్టర్ తరుణ్, వైద్య విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కలవచర్లలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు

● అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి
● వాహనాలను స్వాధీనం చేసుకున్న అధికారులు

రాజానగరం, అక్టోబరు 17: రాజానగరం మండలం కలవచర్ల పోలవరం కాలువగట్టుపై అక్రమంగా గ్రావెల్, మట్టి తవ్వకాలు సాగిస్తున్న లారీలు, యంత్రాన్ని రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా బుధవారం అర్ధరాత్రి దాడిచేసి పట్టుకున్నారు. సంబంధిత అధికారు లు, పోలీసులతో ఫోన్‌లో మాట్లాడి సంఘటనా స్థలానికి రప్పించి వాహనాలను అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రెండు నెలలుగా గుట్టుచప్పుడు కాకుండా అధికార పార్టీ అండదండలో అక్రమంగా పోలవరం సాయిల్ బ్యాంకుకు సంబంధి ంచిన గ్రావెల్, మట్టి తరలిస్తున్నారన్నారు. నియోజక వర్గంలో ఎక్కడచూసినా అవినీతి, అక్రమాలు తప్ప అభివృద్ధి కానరావడం లేదన్నారు. అధికార పార్టీ కనుస న్నల్లోనే ఈ అక్రమ దందా జరుగుతోందని ఆరోపించారు. కలెక్టర్, మైనింగ్ శాఖాధికారులు తక్షణమే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈవిషయమై సమగ్ర విచారణ జరిపించాలని విజిలెన్స్ అధికారులకు, పోలవరం ప్రాజెక్టు అధికారులకు కూడా ఫిర్యాదు చేస్తానని రాజా పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు జక్కంపూడి గణేష్, అడబాల చిన బాబు, ప్రగడ చక్రి, దాట్ల రఘు, ఎర్ని ప్రసాద్, సుంకర శ్రీను తదితరులున్నారు.


కలవచర్లలో సంఘటనా స్థలంలో అధికా రులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

వైభవంగా కనకదుర్గమ్మ నిమజ్జనం

గొల్లప్రోలు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణంలో కనకదుర్గమ్మ నిమజ్జనం గురువారం రాత్రి వైభవంగా జరిగింది. సూరంపేటలో నిలిపిన కనకదుర్గ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి ప్రదర్శనగా నిమజ్జనానికి తీసుకువెళ్లారు. వివిధ దేవతామూర్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. పట్టణ వీధులన్నీ అమ్మవారి నామస్మరణతో మార్మోగాయి.

ఎఫ్ఏసీ ఎస్ఈగా కామేశ్వరరావు

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ ఈఈ-1గా బాధ్యతలు చేపట్టిన వి.కామేశ్వరరావుకు ఎస్ఈగా పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) అప్పగిస్తూ ప్రజారోగ్య, పురపాలక శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఆర్.గోపాల కృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కంప్యూటర్లు

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవతో తొలగిన విద్యార్థుల కష్టాలు



కంప్యూటర్లను వినియోగిస్తున్న గొల్లప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు

గొల్లప్రోలు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కంప్యూటర్లు వచ్చాయి. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవతో విద్యార్థుల కష్టాలు తీరాయి. గొల్లప్రోలులో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పడినప్పటి నుంచి కంప్యూటర్ శిక్షణ ఇచ్చేందుకు కంప్యూటర్లు అందుబాటులో లేవు. దీనితో విద్యార్థులకు శిక్షణ పొందే అవకాశం లేకుండా పోయింది. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ ఓఎస్‌డీ మధుసూదన్, ఇతర కార్యాలయ అధికారులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై పరిశీలించినప్పుడు కంప్యూటర్లు అందుబాటులో లేక విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్న విషయం వారి దృష్టికి వచ్చింది. దీనిపై డిప్యూటీ సీఎం స్పందించి తక్షణం కళాశాలకు కంప్యూటర్లు సమకూర్చాలని ఆదేశించారు. కలెక్టరు షాన్‌మోహన్ స్పందించి సీఎస్ఆర్ నిధులతో రెండు కంప్యూటర్లు కొనుగోలు చేసి జూనియర్ కళాశాలకు అందజేశారు. కంప్యూటర్లపై విద్యార్థులకు శిక్షణ ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ శాంతి తెలిపారు. తమ ఇబ్బందిని గుర్తించి వెంటనే కంప్యూటర్లు సమకూర్చిన పవన్‌కల్యాణ్‌కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.



సిమెంట్ రోడ్డు పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ, మాజీ మంత్రి చిక్కాల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప



వాకతిప్పలో సిమ్మెంట్ రోడ్ల పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ, జనసేన ఇన్‌చార్జి శ్రీనివాస్

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

పల్లె పండుగలో ఎమ్మెల్యేలు చినరాజప్ప, నానాజీ

కాకినాడ రూరల్, అక్టోబరు 17: పల్లె పండుగతో గ్రామాలకు మహర్దశ వచ్చిందని కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగలో భాగంగా గురువారం కాకినాడ రూరల్ మండలం తూరంగి, కొవ్వూరు, కొవ్వాడ, రేపూరు గ్రామాల్లో నిర్మించనున్న పలు సీసీ రోడ్లకు, అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: గ్రామాలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా గురువారం సర్పవరంలో నిర్మిస్తున్న సిమ్మెంట్ రోడ్ల పనులకు మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, టీడీపీ నాయకులు పెంకే శ్రీనివాసబాబా, వాసిరెడ్డి ఏసుదాసు, నులుకుర్తి వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకులు మామిడాల శ్రీనివాసరావుతో కలిసి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే నానాజీ, కూటమి నాయకులకు జనసేన నాయకులు పుల్ల శ్రీరాములు ఆధ్వర్యంలో కార్యకర్తలు స్వాగతం పలికారు. సమావేశంలో మాజీ మంత్రి చిక్కాల, సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, ఎంపీడీవో పి.సతీష్, గ్రామ కార్యదర్శి పబ్బినీడి శ్రీనివాస్, ఏపీవో గణేష్, కూటమి నాయకులు పుల్ల శ్రీరాములు, ముద్దన ప్రకాశరావు, చైర్మన్ శ్రీను, బీజేపీ నాయకుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెద్దాపురం: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పల్లెపండుగ కార్యక్రమాన్ని చేపట్టిందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మండలంలోని కాండ్రకోట, వడ్లమూరు, గోరింట గ్రామాల్లో నిర్వహించిన పల్లెపండుగలో జనసేన కాకినాడ జిల్లా ఇన్‌చార్జ్ తుమ్మల రామస్వామి(బాబు)తో కలిసి గురువారం ఆయన పాల్గొన్నారు. అనంతరం గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, ఎంపీడీవో డి.శ్రీలలిత, టీడీపీ మండల అధ్యక్షుడు కొత్తెం వెంకట శ్రీనివాసరావు(కోటి), ఎలిశెట్టి నాని పాల్గొన్నారు.

కొత్తపల్లి: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ అన్నారు. పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా కొత్తపల్లి మండలం కుతుకుడుమిల్లి, వాకతిప్ప, కొత్తపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న సిమ్మెంట్ రోడ్ల పనులకు గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయిదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రం చాలా నష్టపోయిందన్నారు.

స్టార్‌టెక్స్ రైస్ మిల్లులు తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పన

కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు



ఎమ్మెల్యే కొండబాబును సత్కరిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనుమతులు రద్దు చేసిన పోర్టు ఏరియాలోని స్టార్ టెక్స్ రైస్ మిల్లులను అధికారులతో మాట్లాడి తెరిపించి కార్మికులకు తిరిగి ఉపాధి కల్పించామని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. ఎమ్మెల్యే కొండబాబును గురువారం ఆయన స్వగృహంలో స్టార్ టెక్స్ రైస్‌మిల్లుల ఓనర్లు, కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోర్టు ఏరియాలో రైస్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న స్టార్ టెక్స్ రైస్‌మిల్లుల అనుమతులు రద్దు చేయడంతో మూడు నెలలుగా పనులు లేక కార్మికులు ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, అధికారుల దృష్టికి తెచ్చి అనుమతులు మంజూరు చేయించామన్నారు. దీంతో వందలాది మంది కార్మికుల కుటుంబాలకు ఉపాధి లభించిందన్నారు.

కార్పొరేట్ వైద్యానికి ధీటుగా సేవలందించాలి

ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ వైద్యానికి ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రులలో పేదలకు వైద్యం అందించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ పేదలకు మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తానన్నారు. ఆసుపత్రికి అవసరమగు మౌలిక సదుపాయాలపై ప్రధాన వైద్యాధికారిణి డాక్టర్ అమల ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముందుగా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, బీజేపీ ఇన్‌చార్జి వెంకటరమణ, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్, ఆసుపత్రి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కత్తితో ఇద్దరు వ్యక్తులు హల్‌చల్

కత్తిపోట్లతో ఒకరికి తీవ్ర గాయాలు

కొత్తపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం మూలపేటలో నందీశ్వరుడి విగ్రహావిష్కరణలో జరిగిన వివాదంలో కత్తులతో హల్‌చల్ చేయడం, దాడికి దిగడంతో ఓ వ్యక్తి కత్తిపోట్లకు గురికాగా కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. మూలపేట ప్రకాశ్‌నగర్‌కాలనీలో నందీశ్వరుడి విగ్రహావిష్కరణ గురువారం జరిగింది. ఈ సందర్భంగా స్థానికులు ఎం.తాతీలు, ఆవాల మణికంఠ, ఆవాల లోవరాజు మధ్య ఘర్షణ జరిగింది. దీంతో తాతీలుపై మణికంఠ, లోవరాజు కత్తితో దాడికి పాల్పడ్డారు. ఈ ఘర్షణలో మణికంఠ కత్తిపోట్లకు గురవడంతో మెరుగైన చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కొత్తపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గంజాయి మత్తులో కత్తులతో ఒకరిపై మరొకరు దాడులకు పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తపల్లి పోలీసులు తెలిపారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దళితులు

దళిత ప్రాంతాల్లో ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్ నిర్మాణాలు నిలిపివేయాలి

సామర్లకోట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో దళితుల నివాసాల్లో ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్ ఏర్పాటుతో వారికి అనారోగ్యాలు వ్యాపించే ప్రమాదం ఉన్నందున తక్షణం ప్లాంట్ పనులు నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ గణేష్‌కాలనీకి చెందిన పలువురు దళితులు గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ధర్నా, నిరసన తెలిపారు. తాము ముందుగా ప్లాంట్ ఏర్పాటు యత్నాలను వ్యతిరేకిస్తూ ఒకరోజు ముందుగా మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చినప్పటికీ ప్రజల సమస్యలను పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత ప్రజల జీవనస్థితిగతులపై కమిషనర్ అవమానకరంగా వ్యాఖ్యలు చేయడాన్ని నిరసనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా మానవ హక్కుల పరిరక్షణ సంఘ అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ మాట్లాడారు. ప్రజల నిరసనలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నేతల హరిబాబు, మర్రి శేషారావు, దళిత సంఘాల ప్రతినిధులు పోలిమాటి ప్రసాద్, గొల్లలపల్లి సత్యనారాయణ, నూతలపాటి అప్పారావు, బొంతు సత్యనారాయణ, చెక్కా కుమార్, ములకా చిరంజీవి, మహ్మద్ జాఫర్, మల్లారపు సంజయ్, పాలిక చంటి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

సామర్లకోట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వేట్లపాలెం, మాధవపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలలో విద్యుత్ ఫీడర్లు వార్షిక మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ కార్యనిర్వాహక ఇంజనీరు ఏఈఎన్ఏస్. ప్రభాకర్ గురువారం రాత్రి తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాల్లో వేట్లపాలెం, జీ.మేడపాడు, హుస్సేన్‌పురం, మాధవపట్నం, వీకే.రాయపురం, సత్యవరపుపేట, బోయినపూడి, ఉండూరు, గొంచాల, పీ.వేమవరం, కాపవరం, నవర, రావువారి చంద్రంపాలెం, పవర గ్రామాలకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ప్రభాకర్ చెప్పారు.

సాయిచంద్ర మృతదేహం లభ్యం

తాళ్లరేవు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గోపిలంక పుష్కరఘాట్ వద్ద గల్లంతైన రాజమండ్రి బీటెక్ విద్యార్థి కుతాని సాయిచంద్ర మృతదేహం గురువారం లభ్యమయ్యింది. కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో మృతదేహాన్ని వెతికేందుకు గాలింపు చేపట్టగా సాయిచంద్ర ఎక్కడైతే గల్లంతయ్యాడో అక్కడే మృతదేహం తేలింది. మృతదేహాన్ని తీసి పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి పోలీసులు తరలించారు. కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ నాయకుల అరాచకంపై ఎస్పీకి వినతి

కాకినాడ క్రైం అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల అరాచకంపై కాకినాడ జనసేన నాయకులు గురువారం ఎస్పీ వినతిపత్రం అందజేశారు. దుమ్ములపేట ప్రాంతానికి చెందిన మత్స్యకారులు, టీడీపీ నాయకులపై మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అనుచరులు మారణాయుధాలతో దాడి చేసి గాయపరిచారని, నిందితులపైన, వారిని ప్రేరేపించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జనసేన నాయకుడు మల్లాడి రాజేంద్రప్రసాద్ గురువారం ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌కు అందజేసిన వినతిలో పేర్కొన్నారు. గత వైసీపీ పాలనలో నగరంలో రౌడీ రాజ్యం నడిచిందన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా రౌడీమూకలపై కఠిన చర్యలు తీసుకుని శాంతిభద్రతలను కాపాడాలని ఎస్పీకి ఇచ్చిన వినతిలో కోరారు.

పారిశ్రామిక విధానాలపై కార్మిక సంఘాలతో చర్చించాలి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

కాకినాడ సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక విధానాలపై కార్మిక సంఘాలతో సమగ్రంగా చర్చించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. సుందరయ్య భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబరు 8 నుంచి 15 వరకు ప్రజాపోరు పేరుతో వారం రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సమస్యలు, అధిక ధరలు, నిరుద్యోగం, విశాఖ ఉక్కు పరిరక్షణ, పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి జిల్లా, మండల కార్యాలయాల వద్ద నిరసనలు జరుగుతాయన్నారు. విద్యుత్ కార్యాలయాల వద్ద 18న ధర్నాలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు ఏవీ నాగేశ్వరరావు, ఎం.రాజశేఖర్, దువ్వా శేషబాబ్జీ, కేఎస్ శ్రీనివాస్, కరణం ప్రసాదరావు పాల్గొన్నారు.



పెద్దాపురంలో వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీవో శ్రీరమణి



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాయక్

మానవాళికి వాల్మీకి జీవితం ఆదర్శం

పెద్దాపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మానవాళికి వాల్మీకి జీవితం ఆదర్శమని ఆర్డీవో కట్టెడ్డి శ్రీరమణి అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన వాల్మీకి జయంతిలో ఆమె పాల్గొన్నారు. ముందుగా వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యాలయ ఏవో మాధవరావు, డీటీ భానుకుమార్ పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొద్దు తులసీమంగతాయారు, శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు. మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, మేనేజర్ జ్యోతిరాణి, డీఈ ప్రకాశరావు, ఏఈ జీవప్రసాద్, కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కరరావు, రాజశేఖర్, వాసంశెట్టి గంగ పాల్గొన్నారు.

సామర్లకోట: మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గురువారం వాల్మీకి జయంతిని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజరు కనకరాజు, టీపీవో మంజుల, పి.సురేంద్రకుమార్, పి.జానకిబాబు, గూడుపు శ్రీనివాసరావు, రమాదేవి, నేతల కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వాల్మీకి జయంతిని నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి ఎంపీడీవో కర్రి స్వప్న, ఈవోపీఆర్డీ కుమార్, ఎంపీపీ అరిగెల అచ్చియమ్మ రామయ్యదొర నివాళులర్పించారు.

జీజీహెచ్(కాకినాడ): రామాయణాన్ని రచించిన మహర్షి వాల్మీకి మహోన్నతుడని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ కొనియాడారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని డీఎంహెచ్‌వో కార్యాలయంలో డాక్టర్ నాయక్ గురువారం వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు. మహర్షి వాల్మీకి జీవన విధానాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. డాక్టర్ ఐ.ప్రభాకర్, డాక్టర్ సురేఖ, ఏఓ జి.దేవకుమారి, డెమో ప్రసాద్‌రాజు పాల్గొన్నారు.



సినీ సంగీత విభావరి ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

20న సినీ సంగీత విభావరి

పోర్టుసిటీ(కాకినాడ), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కోన విజయరామారావు మెమోరియల్ మ్యూజిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 20న సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నామని సంస్థ వ్యవస్థాపకుడు బీవీఎస్ ప్రభాకర్ తెలిపారు. దంటు కళాక్షేత్రంలో సంగీత విభావరి ఆహ్వాన పత్రికను కాకినాడ సాహితీ స్రవంతి అధ్యక్షుడు మార్ని జానకిరామ్‌చౌదరి ఆవిష్కరించారు. 20న సాయంత్రం ఏదో ఒక రాగం పిలిచింది.. వేళా పేరుతో విభావరి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాదెళ్ల ప్రభుదాస్, రఘుబాబు, కట్టా కృష్ణారావు, తీపర్తి విజయ్, రమణ పాల్గొన్నారు.



తాళ్లరేవులో కంపెనీ ప్రతినిధులు, గ్రామస్తులతో చర్చలు జరుపుతున్న అధికారులు

కంపెనీలు గ్రామాన్ని అభివృద్ధి చేయాలి

తాళ్లరేవు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ కంపెనీ పోలేకుర్రు గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని పోలేకుర్రు సర్పంచ్ వెంటపల్లి నూకరాజు డిమాండ్ చేశారు. గురువారం తాళ్లరేవు తహశీల్దార్ పి.త్రినాధరావు, డీటీ సూరిబాబులు కంపెనీ ప్రతినిధులు, గ్రామస్తులతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. గ్రామస్తుల డిమాండ్లు పరిష్కారం అయ్యే వరకు గ్యాస్ ట్యాపింగ్ పాయింట్‌పనులు నిలిపివేయాలని, రిలయన్స్, ఓఎన్‌జీసీ సంస్థలు పోలేకుర్రు గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని లేకుంటే వాటరు పంపింగులను నిలుపుదల చేస్తామని గ్రామస్తులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దడాల బుజ్జిబాబు, గ్రామస్తులు వడ్లమూరి సతీష్, పలివెల అప్పారావు, కడలి సింహాచలం, సాదనాల శివరామకృష్ణ, వూడా వెంకటరామకృష్ణ, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

వెలుగు కార్యాలయం పరిశీలన

కిర్లంపూడి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వెలుగు కార్యాలయంలో గురువారం శ్రీనిధి జిల్లా ఏజీఎం వై.చిట్టిబాబు సందర్శించారు. ఎన్డీఏ మోనటరింగ్‌లో భాగంగా కార్యాలయాన్ని సందర్శించామన్నారు. సభ్యులంతా బకాయిలు ఎప్పటికప్పుడు కడుతూ వ్యాపారాలు అభివృద్ధి చేసుకోవాలన్నారు.

'అన్ని రోజులు ఒకేలా ఉండవు'

కాకినాడ క్రైం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అన్ని రోజులు ఒకేలా ఉండవని, తమకు మంచి రోజులు వస్తాయని మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఈనెల 15న దుమ్ములపేటలో అమ్మవారి ఊరేగింపు సందర్భంగా తలెత్తిన వివాదంలో సీరం చిన్న, కోంద్రు తాతారావు గాయపడిన విషయం తెలిసిందే. ఆ వివాదాన్ని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు రాజకీయం చేసి దాని తమ వర్గం చేసిన దాడిగా అభివర్ణిస్తున్నారని గురువారం ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఇచ్చిన వినతిలో ఆయన పేర్కొన్నారు.

వరిపై ఆకుముడత, దోమపోటు

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 17: వరిపంటపై ఆకుముడత, దోమ ఆశించినట్లు గుర్తించామని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ అయ్యాల సోమయాజులు, సీతారామశర్మ తెలిపారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులతో కలిసి గురువారం వారు గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వరి పొలాలను పరిశీలించారు. వరిపై దోమపోటు తీవ్రతకు అనుగుణంగా పైమెట్రోజెన్ అనే మందును పిచికారీ చేయాలన్నారు. వారి వెంట ఉద్యానవనశాఖాధికారి గోవిందరాజులు ఉన్నారు.

ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన వరహాలబాబు

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా(ఏసీపీ) వాసంశెట్టి వరహాలబాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. శ్రీకాకుళంలో పనిచేసిన ఆయన బదిలీపై కాకినాడ వచ్చారు. గతంలో 2007లో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా కాకినాడలో పనిచేశారు. ఈ సందర్భంగా సెక్షన్ సూపరింటెండెంట్ రామశాస్త్రి, టీపీఎస్‌లు రమణ, రామ్మోహన్, బాలసుబ్రహ్మణ్యం, జే1 సీతారాం, శ్యామ్, ఇతర సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వరహాలబాబు నగరపాలక కమిషనర్ భావనను మర్యాద పూర్వకంగా కలిశారు.



కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

'ధాన్యం కొనుగోళ్లలో నిబంధనలు పాటించాలి'

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో నిబంధనలు పాటించాలని గొల్లప్రోలు తహశీల్దారు సత్యనారాయణ సూచించారు. గొల్లప్రోలు పట్టణం, మండలంలోని తొమ్మిది ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నియమించిన సిబ్బంది, వీఆర్వోలు, రైతు సేవా కేంద్రం సిబ్బందికి గురువారం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. కొనుగోలు సమయంలో పాటించాల్సిన నిబంధనలు, ధాన్యం ప్రమాణాలు తదితర విషయాలను వివరించారు. మండల వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణ, సివిల్ సప్లైస్ టెక్నికల్ టీమ్ కిషోర్, సురేష్, పోసిన సత్య శిక్షణ ఇచ్చారు.



కుతుకుడుమిల్లిలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న బీజేపీ నాయకులు

'దేశ సమగ్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం'

కొత్తపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల వద్దకు తీసుకెళ్లి సభ్యత్వ నమోదు చేపట్టాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి రావూరి లక్ష్మణస్వామి అన్నారు. కొత్తపల్లి, కుతుకుడుమిల్లి గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వాలు అందజేశారు. అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ కృష్ణంరాజు, రాష్ట్ర చేనేత సెల్ కోకన్వీనర్ రవణం సుబ్రహ్మణ్యం, దాట్ల వెంకట సూర్యనారాయణరాజు, గండి కొండలరావు, కె.గంగరాజు, అడబాల మోహనరావు, గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ సెంటర్‌ను పరిశీలించిన ఎంబీవీకే సభ్యులు

పెద్దాపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రామారావుపేటలోని ఏసీటీ సైన్స్ సెంటర్‌ను మాకినీడి బసవపున్నమ్మ విజ్ఞాన కేంద్రం(విజయవాడ) సభ్యులు గురువారం పరిశీలించారు. ఎంబీవీకే చైర్మన్ మధు, కార్యదర్శి మురళీకృష్ణ సైన్స్ సెంటర్‌లో ఉన్న పరికరాలు, విద్యార్థులకు ప్రయోగాలు చెప్పే విధానం గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బుద్దా శ్రీనివాస్, నవీన్ నానీ, సునీత తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుడి సాక్షిగా ఒక్కటైన 150 జంటలు

అన్నవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో గురువారం నూత న దంపతులతో సందడి నెలకుంది. బుధవారం రాత్రి 8.30, 12.30 ముహూర్తాలలో దేవస్థానంలో సత్యదేవుడి సాక్షిగా 150 జంటలు ఒక్కటయ్యాయి. వీరితోపాటుగా వివిధ ప్రాంతాలలో వివాహం చేసుకున్న జంటలు స్వామివారి వ్రతమాచరించుకున్నారు. వీరికి ఇబ్బందులు కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. సుమారు 500 కొత్తజంటలు వివిధ సమయాలలో సత్యదేవుడి వ్రతమాచరించుకున్నారు. గురువారం ఒక్కరోజు వివిధ విభాగాల ద్వారా స్వామివారికి రూ.40 లక్షలు ఆదాయం లభించింది.



సత్యదేవుడి వ్రతాలాచరిస్తున్న నూతన దంపతులు

వినాయక సదన్‌కు రూ.3లక్షలు విరాళం

అయినవిల్లి, అక్టోబరు 17ఆంధ్రజ్యోతి): అయినవిల్లిలో వినాయక సదన్‌లో ఒక వసతి గది ఆధునికీకరణకు గురువారం అయినవిల్లికి చెందిన మద్దింశెట్టి బ్రహ్మయ్య కుమార్తె నల్లం లక్ష్మీనరసయమ్మ, భర్త బాలకృష్ణారావు పేరున వారి సంతానం రూ.3లక్షలు విరాళం అందజేశారు. వీరికి ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించి శ్రీస్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి దాతను అభినందించారు.



దాతకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న దృశ్యం

జొన్నాడలో 40కాసుల బంగారు ఆభరణాల చోరీ

ఆలమూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడలో ఇంటి తలుపులు పగులగొట్టి ఇంట్లోని 40కాసుల బంగారు ఆభరణాలను దొంగిలించారు. ఈమేరకు ఆలమూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు వివరాలు ఇలా ఉన్నాయి. జొన్నాడకు చెందిన చిటికెన సోమరాజు తన భార్య అనారోగ్య కారణంగా ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లారు. ఎప్పటిలాగే పనిమనిషి ఇంటిని శుభ్రం చేయడానికి రావడంతో తలుపులు పగులగొట్టి ఉన్నాయి. దీంతో ఆత్రేయపురం గ్రామానికి చెందిన జానా మారుతిశివరామ్ ఇచ్చిన ఫిర్యాదులో ఇంట్లో 40 కాసుల బంగారు ఆభరణాలు దొంగిలించినట్లు పేర్కొన్నారు. రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్, క్లూస్ టీం ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అండర్ - 14 బాలురు, బాలికల ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫుట్‌బాల్ గ్రౌండ్స్‌లో గురువారం ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా అండర్ 14 బాలురు, బాలికల జట్టు ఎంపికలు జరిగాయి. 90మంది బాలురు, 40 మంది బాలికలు హాజరయ్యారు. డీవైఈవో నారాయణరావు, ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి స్వామి, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ గౌరవ కార్యదర్శి సుంకర నాగేంద్ర కిషోర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రమణమూర్తి, జిల్లా వ్యాయామ సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఏవీడీ ప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.

చోరీపై కేసు నమోదు

గండేపల్లి, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): బంగారం, నగదు చోరీపై కేసు నమోదు చేసినట్లు గండేపల్లి పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలో బొర్రంపాలెం గ్రామానికి చెందిన మంగిన వీర వెంకటేశ్వరరావు తన కుటుంబంతో హైదరాబాద్‌లో ఉపాధి నిమిత్తం ఉంటున్నాడని అయితే అతని సొంత ఇల్లు బొర్రంపాలెంలో ఉంది. వెంకటేశ్వరరావు హైదరాబాద్ నుంచి ఈనెల మొదటివారంలో వచ్చి దివ్యాంగ పెన్షన్ తీసుకుని హైదరాబాద్ వెళ్లినట్లు తెలిపారు. గురువారం వెంకటేశ్వరరావు ఇంటి తలుపుల తాళాలు పగలకొట్టి ఉండటంచూసి చుట్టుప్రక్కల వారు ఈ విషయాన్ని వెంకటేశ్వరరావుకు తెలిపారు. మల్లిపల్లిలో ఉంటున్న అతని మరదలు వరలక్ష్మి వచ్చి ఇంట్లో చూడగా బీరువాలో దాచుకున్న సుమారు లక్షరూపాయల విలువ చేసే బం గారు వస్తువులు, రూ.20వేలు నగదు దొంగలించారని గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్ఐ యూవీ శివనాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గండేపల్లిలో 14.5 కిలోల గంజాయి పట్టివేత



గంజాయి పట్టుకున్న పోలీసులు

గండేపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గండేపల్లి గ్రామ శివారున జాతీయరహదారి మీదుగా అక్రమంగా తరలిస్తున్న గంజాయిని గురువారం గండేపల్లి పోలీసులు పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు గండేపల్లి ఎస్ఐ యువి శివనాగబాబు తనిఖీలు చేయగా మోటారు సైకిల్‌పై ఇద్దరు వ్యక్తులు గంజాయి తరలిస్తుండడాన్ని గుర్తించారు. దీనిపై వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 14.5 కేజీల గంజాయి, మోటారుసైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. గం జాయి విలువ రూ.72,500 ఉంటుందన్నారు. పల్నాడు జిల్లాకు చెందిన కేతవత్ స్వామి నాయక్, మామిళ్లపల్లి బాలగణేష్‌ను గండేపల్లి డిప్యూటీ తహసీల్దార్ దివ్య భారతి సమక్షంలో అరెస్టు చేశామన్నారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఎస్ఐ శివనాగబాబును అభినందించారు.

కత్తితో ఇద్దరు వ్యక్తులు హల్‌చల్

కొత్తపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం మూలపేటలో నందీశ్వరుడి విగ్రహావిష్కరణలో జరిగిన వివాదంలో కత్తులతో హల్‌చల్ చేయడం, దాడికి దిగడంతో ఓ వ్యక్తి కత్తిపోట్లకు గురికాగా కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. మూలపేట ప్రకాశ్‌నగర్‌కాలనీలో నందీశ్వరుడి విగ్రహావిష్కరణ గురువారం జరిగింది. ఈ సందర్భంగా స్థానికులు ఎం.తాతీలు, ఆవాల మణికంఠ, ఆవాల లోవరాజు మధ్య ఘర్షణ జరిగింది. దీంతో తాతీలుపై మణికంఠ, లోవరాజు కత్తితో దాడికి పాల్పడ్డారు. ఈ ఘర్షణలో మణికంఠ కత్తిపోట్లకు గురవడంతో మెరుగైన చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కొత్తపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గంజాయి మత్తులో కత్తులతో ఒకరిపై మరొకరు దాడులకు పాల్పడిఉంటారని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

భక్తుడికి దేవస్థానం కాంట్రాక్టు ఉద్యోగి టోకరా

- నకిలీ గదుల రసీదుతో మోసం

అన్నవరం, అక్టోబరు 17: అన్నవరం దేవస్థానంలో ఒక కాంట్రాక్టు ఉద్యోగి నకిలీ గదుల బుకింగ్ రసీదుతో టోకరా వేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే ఒక పెండ్లి బృందానికి బుధవారం జూన్ నెల 26న బుకింగ్ చేసుకున్న హరిహరసదన్ సత్రంగది రిజర్వేషన్ గది రసీదును ఎడిట్‌చేసి అక్టోబరు 16న బుకింగ్ చేసినట్లు పెళ్లిబృందానికి సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయ గుమస్తా సంతకాన్ని ఫోర్జరీ చేసి అందివ్వడంతో పెళ్లిబృందం ఆ రసీదుతో సత్రం వద్దకు వెళ్లగా స్కాన్ కాకపోవడంతో పెళ్లిబృందం అవాక్కయ్యారు. దీంతో వారు ఈవో కార్యాలయంలో ఫిర్యాదుచేయగా దళారీని పట్టుకుని స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలని ఈవో సూచించారు. పెళ్లిబృందం ఇబ్బందిపడకుండా కరెంటు బుకింగ్ ద్వారా అద్దెతీసుకుని సత్రం గది కేటాయించారు. దీనిపై కంప్యూటర్ వ్యవహారాలు చూసే ఉద్యోగి రమేష్ ఇది హ్యాక్ చేయడంకాదని ఏఈ జు బుకింగ్‌కు ఆరోజు స్కాన్ చేస్తేనే సిస్టమ్ తీసుకుని గది కేటాయిస్తారన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

12మంది పోలీస్ సిబ్బందికి వీడ్కోలు

కోటనందూరు,అక్టోబర్17(ఆంధ్రజ్యోతి): కోటనందూరు స్టేషన్ నుంచి 12మంది సిబ్బంది బదిలీపై వెళ్లిన వారిని ఎస్ఐ టి.రామకృష్ణ ఆధ్వర్యంలో సత్కరించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గండేపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పి.నాయకంపల్లి గ్రామ పరిధిలో శుక్రవారం విద్యుత్ లైన్‌ల మరమ్మతులో భాగంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ డీఈ బి.వీరభద్రరావు అన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి


వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పీవో సింహాచలం, ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, అక్టోబరు 17: రంపచోడవరంలో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఐటీడీఏ కార్యాలయంలో పీవో కట్టా సింహాచలం వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక వాల్మీకి పేటలో ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వాల్మీకి రామాయణాన్ని అవగాహన చేసుకొని రానున్న తరాలకు తెలిపే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు, వాల్మీకి సంఘం నాయకులు గొర్లె చిన నారాయణరావు, గొర్లె బాలాజీబాబు, వై.నిరంజనీదేవి పాల్గొన్నారు.

పి.యర్రగొండ గురుకుల కళాశాలలో

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి నివాళులర్పించి వాల్మీకి విశిష్టత గురించి వివరించారు.

'విద్యార్థులకు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి'



మోతుగూడెం, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలో గురువారం డీఏవీ పాఠశాల విద్యార్థులకు మోతుగూడెం ఎస్ఐ శివనారాయణ మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దని భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని చక్కగా చదువుకుని భవిష్యత్‌లో స్థిరపడాలని తల్లిదండ్రులను సంతోషపెట్టాలని విద్యార్థులకు సూచించారు. మత్తు పదార్థాలు స్వీకరిస్తే భవిష్యత్ అంధకారం అవుతుందని అది మంచి మార్గం కాదని విద్యార్థులకు తెలిపారు. ఏపీ జెన్కో లోయర్ సీలేరు సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ చిన్న కామేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ బాలకృష్ణ, వర ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు మల్లెల రఘురాం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవీపట్నం: మండలంలో కొండమొదలు కాలనీలో గంజాయి, కల్తీ మద్యం, రోడ్డు ప్రమాదాలు, సైబర్ మోసాలు, పొలాల్లో విద్యుత్ తీగలు వేయడం వంటి వాటి నివారణపై కొండమొదలు కాలనీలో రంపచోడవరం సీఐ రవికుమార్, దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ అవగాహన సమావేశం నిర్వహించారు. కొత్తవీధిని సందర్శించి సంకల్ప కార్యక్రమం నిర్వహించి డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సమావేశం నిర్వహించారు.




రేఖవానిపాలెంలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దివ్య


శంఖవరంలో పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

పల్లె పండుగలో ఎమ్మెల్యేలు జ్యోతుల, దివ్య, సత్యప్రభ

గండేపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. గురువారం గండేపల్లి మండలంలో తాళ్లూరు, నీలాద్రిరావుపేట, జడ్.రాగంపేట, పి.నాయకంపల్లి, యల్లమిల్లి గ్రామాల్లో పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నెహ్రూ, జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ శంకుస్థాపనలు చేశారు. తాళ్ళూరు, నీలాద్రిరావుపేట, జెడ్.రాగంపేటలో, టి.నాయకంపల్లి, యల్లమిల్లిలో అభివృద్ధి పను లను పరుగులు పెట్టిస్తామన్నారు. నీలాద్రిరావుపేటలో పద్మ ఇండస్ట్రీస్ అధినేత కంచర్ల శ్రీనివాస్ ఆర్వో ప్లాంటు మరమ్మతుకు విరాళం అందిం చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కార్యక్రమంలో కోర్పు లచ్చయ్యదొర, ఎస్వీఎస్ అప్పలరాజు, పోతుల మోహనరావు, కందుల చిట్టిబాబు, కోర్పు సాయితేజ, జాస్తి వసంత్, కందుల విజయ్, శీలామంతుల వీరబాబు, కురుకూరి వీర వెంకటచౌదరి, పైణ్ణి వెంకటేశ్వరరావు, దాపర్తి సీతారామయ్య, అడబాల భాస్కరరావు, సుంకవిల్లి వీరవెంకట సత్యనారాయణ, పెనుమర్తి భాస్కరరావు, ఎంపీడీవో నాతి బుజ్జి, ఎమ్మార్వో శ్రీను, మద్దిపూడి వీరవెంకటసత్యనారాయణ, మాదిరెడ్డి కృష్ణార్జున, దేవిశెట్టి బాబ్జి, మలిరెడ్డి అన్నపూర్ణ, పాపారావు, నూకతట్టు నాగజ్యోతి, సుబ్బారావు, చీకట్ల నాగరాజు, సన్నపు సోమరాజు, బూరా ప్రసాద్, పెనుమర్తి అర్జునరావు, చుండ్రు అప్పలరాజు పాల్గొన్నారు.

తొండంగి: ప్రగతి పథంలో పల్లెలు పయనించడం ద్వారా దేశగతి మారుతుందని తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. గురువారం ఒంటిమామిడి గ్రామంలో పల్లె పండుగలో భాగంగా సిమెంటు రహదారుల నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. అనంతరం కొత్తపాకలు గ్రామంలో సీసీ రోడ్డుకు ఆమె భూమిపూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్, పార్టీ మండలాధ్యక్షులు చొక్కా అప్పారావు, పార్టీ బీసీ సెల్ మండలాధ్యక్షుడు కొయ్యా రామకేశవ, తెలుగు యువత మండలాధ్యక్షుడు బంటుపల్లి అన్వేష్, ఒంటిమామిడి గ్రామ సర్పంచ్ అంగులూరి సుధాకర్, అరిగెల నర్సింహమూర్తి ఎంపీడీవో రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తుని రూరల్: గ్రామాభివృద్ధి ప్రభుత్వ లక్ష్య మని తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. మండలంలోని రాకవానిపాలెం పంచాయతీ, మరువాడ గ్రామాల్లో డ్రైన్, సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపనకు శ్రీకారం చుట్టారు. ఆమె వెంట స్థానిక నాయకులు సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, చింతమనేడి అబ్బాయి, ఎంపీటీసీ నడిగట్ల అర్జులక్ష్మి తదితరులున్నారు.

శంఖవరం: చంద్రబాబు ప్రభుత్వంలో గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెడుతోందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. పల్లె పం దుగ వారోత్సవాల్లో భాగంగా మండలంలో గురువారం పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుసాపనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు పర్వత సురేష్, వెన్నా ఈశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షంతో చిత్తడిగా మారిన పలు ప్రాంతాలు

ప్రత్తిపాడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం వల్ల గురువారం ప్రత్తిపాడులో కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలుమార్లు విడతల వారీగా వర్షం పడింది. వారం రోజులుగా విరామం లేకుండా అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో మండలంలోని గ్రామాలు చిత్తడిచిత్తడిగా మారాయి. దీంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

చెరువుల్లా మారుతున్నా పట్టించుకోరా: ప్రత్తిపాడులో వర్షం పడితే చాలు.. పలు ప్రదేశాలు చెరువుల్లా మారుతున్నాయి. వర్షపునీరు వెళ్ళే మార్గం లేక ఈ పరిస్థితి తలెత్తుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఫైర్‌స్టేషన్ ఆవరణ, హైస్కూల్‌కు వెళ్ళే మార్గంతో పాటు ప్రధాన రహదారిని వర్షం నీరు ముంచెత్తున్నది. వర్షం పడితే చాలు అల్లూరి సీతారామరాజు సెంటర్ చిన్నపాటి చెరువును తలపిస్తున్నది. రహదారుల వెంబడి నీరు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి ముంపునీటి బెడద నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

తొండంగి: మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. అల్పపీడన ప్రభావంతో సుమారు రెండుగంటల పాటు వర్షం పడుతూనే ఉంది. దీంతోపాటు పెద్ద పెద్ద ఉరుములు మెరుపులకు పలువురు ఉలిక్కిపడ్డారు.



వైసీపీలో చేరిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు గురువారం వైసీపీలో చేరారు. తాడేపల్లి వైసీపీ కార్యాలయంలో మాజీ సీఎం జగన్ సమక్షంలో ఆయన వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ధర్మవరం గ్రామానికి చెందిన ఆయన్ను మాజీ సీఎం జగన్ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈయన చేరికతో నియోజకవర్గ వైసీపీ శ్రేణులు హర్షం చేశాయి.

మురళీకృష్ణంరాజుకు వైసీపీ కండువా వేస్తున్న మాజీ సీఎం జగన్

జగ్గంపేట ఎమ్మెల్యేను కలిసిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే

జగ్గంపేట, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): నేడు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పుట్టిన రోజు సందర్భంగా గురువారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమె వెంట రాష్ట్ర టీడీపీ పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి పేరాబత్తుల రాజశేఖర్, ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ నాయకులు ఉన్నారు.

జనసేన ఇన్‌చార్జ్ పరామర్శ

జగ్గంపేట, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): కడియపులంక గ్రామానికి చెందిన శ్రీ సత్యదేవా నర్సరీ అధినేత పుల్లా సత్యనారాయణ ఇటీవల మృతి చెందారు. గురువారం జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ వారి కుటుంబ సభ్యులు పరామర్శించారు. ఆయన వెంట వెడబోయిన శ్రీను, ఎల్లపు దొరబాబు, బాలు సూరంపాలెం, గోకేడ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

రోడ్డు పనులకు శ్రీకారం

కోటనందూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామాఅభివృద్ధే ఎన్‌డిఏ కూటమి లక్ష్యమని తుని నియోజకవర్గ ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. గురువారం మండలంలోని జగన్నాథపురం, కోటనందూరులో రోడ్డులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గాడి రాజుబాబు, టీడీపీ సీనియర్ నేతలు యనమల రాజేష్, సుర్ల లోవరాజు తదితరులతో పాటు తహశీల్దార్ సుబాష్, ఎంపీడీవో సత్యనారాయణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యలో ఆరు రోజుల కార్యశాల ప్రారంభం

గండేపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల హ్యూమానిటీస్ అండ్ బేసిక్ సైన్స్ విభాగంలో మోటివేషనల్ వర్క్‌షాప్ ఆన్ ఫెయిల్యూర్ ఈజ్ నాట్ యువర్ డ్రీమ్ ఫర్ అకాడమిక్ అండ్ కెరీర్ డెవలప్‌మెంట్ అంశంపై ఆరు రోజుల పాటు విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం జరుగుతుందని ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో హౌ డి స్టూడెంట్స్ వి ఎన్ హెన్స్ థేయిర్ పర్సనల్ గ్రోత్, కెరీర్ స్కిల్స్, మోటివేషన్, అండ్ గోల్ అచీవ్‌మెంట్ స్ట్రాటజీస్ వస్ అనే అంశాలపై ఆయన చర్చించారు.

వెలుగు కార్యాలయం పరిశీలన

కిర్లంపూడి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వెలుగు కార్యాలయంలో గురువారం స్త్రీనిధి జిల్లా ఏజీఎం వై.చిట్టిబాబు సందర్శించారు. ఎస్పీఏ మోనటరింగ్‌లో భాగంగా కార్యాలయాన్ని సందర్శించామన్నారు. సభ్యులంతా బకాయిలు ఎప్పటికప్పుడు కడుతూ వ్యాపారాలు అభివృద్ధి చేసుకోవాలన్నారు.

ప్రతిభను గుర్తించేందుకే బేస్‌లైన్ అసెస్మెంట్ టెస్టులు

● ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం, అక్టోబరు 17: విద్యార్థుల ప్రతిభను గుర్తిం చేందుకు బేస్‌లైన్ అసెస్మెంట్ టెస్టులు నిర్వహిస్తామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. చదువులో వెనుకబడ్డ విద్యార్థు లను గుర్తించేందుకు బేస్‌లైన్ టెస్టులు నిర్వహించి తద్వారా వచ్చిన మార్కుల ఆధారంగా గ్రేడులుగా విభజించాలన్నారు. గ్రేడు వెనుకంజలో ఉన్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులను కృషి చేయాలన్నారు. విద్యా ర్థులు టెక్నికల్ కోర్సులపై ఆసక్తి కలిగేలా మాస్టర్ ట్రైనర్లను నియమించి వారానికి ఒకరోజు కెరియర్‌పై ఒక పిరియడ్ కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశా ఖాధికారి రామకృష్ణ, రిసోర్సుపర్సన్లు సాయిబాబా, టాల్‌స్టాయ్, ఎమ్మార్పీలు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగులకు సత్కారం

రంపచోడవరం, అక్టోబరు 17: స్థానిక తహశీల్దారు కార్యాల యంలో విధులు నిర్వహించి బదిలీపై వెళుతున్న ఉద్యోగులకు గురువారం ఘనంగా సత్కరించారు. ఇన్‌చార్జి తహశీల్దారుగా పనిచేసి సివిల్ సప్లయి ఎంఎస్‌వోగా బదిలీపై వెళ్లిన బి.రాజు, తహశీల్దారుగా పనిచేసి ఏలూరుజిల్లా తహశీల్దారుగా బదిలీపై వెళ్లిన ఎ.కృష్ణజ్యోతి, సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన టి.లక్ష్మణ్, చెల్లాయమ్మలను సత్కరించారు. డీటీ రవీంద్రబాబు, ఆర్ఐ సీహెచ్ నిర్మల, సీనియర్ అసిస్టెంట్లు జిలానీ, అలెగ్జాండర్, ఇందిరాబాయ్, సాయి, మాధురి, వీఆర్వోలు ఆనంద్, రవి, సత్యనారాయణ, ఒసేపు, వీరమణి, వెంకటరెడ్డి, మార్తమ్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

దేవీపట్నం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని వి.రామన్నపాలెం పంచాయతీ వెలగపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త కొండ్ల చిన్నకొండారెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. దీంతో తలకు బలమైన గాయమైంది. చికిత్స పొంది ఇంటివద్ద ఉంటున్న కొండారెడ్డిను గురువారం రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష, విజయ్‌భాస్కర్ పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

వై.రామవరం తహసీల్దార్‌గా వేణుగోపాల్

వై.రామవరం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం తహసీల్దార్‌గా వి.వేణుగోపాల్ నియమితులయ్యారు. ఆయన ఎటపాక మండలంలో తహసీల్దార్‌గా పనిచేసి ఇక్కడకు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా ఆయన కార్యాలయంలో వాల్మీకి జయంతిని పురస్కరించుకుని వాల్మీకి మహర్షి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. మండలంలో రెవెన్యూ సేవలను అంకిత భావంతో నిర్వర్తిస్తానని ఆయన తెలిపారు.సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

గుంపెనపల్లి వాగు పరిశీలించిన ఎమ్మెల్యే

దేవీపట్నం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలగపల్లి నుంచి లక్ష్మీపురం వెళ్లేదారిలో ఉన్న గుంపెనపల్లి వాగును గురువారం రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి పరిశీలించారు. ఈ వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. ఆమె వెంట టీడీపీ నాయకులు కోసు లచ్చన్నదొర, ఏలేటి కృష్ణమోహన్, ధర్మరాజు ఉన్నారు.